

హామీల అమలు కోరుతూ ఎపిటిఎఫ్ ఆందోళన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

కూటమి ప్రభుత్వం ఉద్యోగుకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని ఎపిటిఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ టి.నారాయణదాసు తెలిపారు. సోమవారం ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణదాసు మాట్లాడుతూ ఇప్పటికే చాలా కాలం నుండి హామీల అమలుకు ఎంతో ఓపికతో ఎదురు చూస్తున్నామన్నారు. ఐనా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడం తీవ్ర నిరాశకు గురి చేస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలు విడుదల చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, పిఆర్‌సి అమలు, బోధనేతర పనులు తగ్గించాలని కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామన్నారు.

బ్లాక్ మార్కెట్ చేస్తే.. పీడీ యాక్టు కేసులు

యూరియా సరఫరాలో సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఇన్‌ఛార్జి మంత్రి ఆదేశం

ప్రతి సొసైటీకీ 25 మెట్రిక్ టన్నుల యూరియా ఇవ్వాలి

నానో యూరియాను రైతులు తీసుకోవడం లేదని వెల్లడి

ఇ-పోస్ సమస్యలతో పంపిణీలో తీవ్ర ఇబ్బందులు

దాళ్వాలో కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టండి

ఎరువుల సరఫరా సమీక్షా సమావేశంలో సొసైటీల అధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, అక్రమంగా తరలించే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలని ఎస్‌పికి ఆదేశాలిచ్చినట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఎరువుల సరఫరా, పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి డిసిఒ ఆరిమిల్లి శ్రీనివాస్, జిల్లా అధికారులు, జిల్లాలోని సహకార సంఘాల అధ్యక్షులు, పలువురు రైతులు పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి హబీబ్ భాషా జిల్లాలో యూరియా సరఫరా, ప్రస్తుతం నిల్వల వివరాలను వెల్లడించారు. జిల్లాలో 530 ఏజెన్సీల ద్వారా యూరియా సరఫరా చేస్తున్నామని, రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలో 130 సహకార సంఘాల నుంచి యూరియా సరఫరా జరుగుతుందని తెలిపారు. ఖరీఫ్‌లో 33,762 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవ్వగా ఇప్పటి వరకూ 30,557 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందన్నారు. మరో రెండు వేలకుపైగా మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ముందుగా సహకార సంఘాల అధ్యక్షులు ఎరువుల పంపిణీపై సమస్యలు చెప్పాలని ఇన్‌ఛార్జి మంత్రి కోరారు. దీంతో చేబ్రోలు సొసైటీ అధ్యక్షులు కడియాల రవిశంకర్, పెదవేగి సొసైటీ అధ్యక్షులు తాతా సత్యనారాయణ, చింతలపూడి మండలం ఎర్రంపల్లి సొసైటీ అధ్యక్షులు తాళ్లూరి చినబాబు, కొయ్యలగూడెం సొసైటీ అధ్యక్షులు దుగ్గిన శ్రీనివాస్, ఆగిరిపల్లి మండలం కృష్ణవరం సొసైటీ అధ్యక్షులు కె.శ్రీనివాస్, కొప్పాక సొసైటీ అధ్యక్షులు వీరవెంకట వరప్రసాద్, తడికలపూడి సొసైటీ అధ్యక్షులు టి.బాలాజీ, మక్కినవారిగూడెం సొసైటీ అధ్యక్షులు సూర్యనారాయణ, జీలకర్రగూడెం సొసైటీ అధ్యక్షులు సురేష్‌తో పలువురు మాట్లాడారు. యూరియా కొరత సమస్య లేదని, సరఫరాలో ఇబ్బందులతో సమస్యలు వస్తున్నాయని అన్నారు. సహకార సంఘాలకు 12 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేస్తున్నారని, దీంతో రైతులకు చాలడం లేదని, దీంతో మళ్లీ వచ్చినప్పుడు మిగిలిన రైతులకు ఇవ్వాల్సి వస్తుండటంతో రైతుల్లో అలజడి ఏర్పడి పెద్దసంఖ్యలో వస్తున్నారన్నారు. పామాయిల్‌కు యూరియా సరఫరా చేయలేకపోతున్నట్లు తెలిపారు. నానో యూరియా వద్దని రైతులు గొడవ చేస్తున్నారని, ఎవరూ వాడకపోవడంతో గడువు తేదీ సైతం ముగిసిపోయి నిల్వ ఉండిపోతుందన్నారు. ఆయిల్‌పామ్, జామాయిల్ ఇతర ఉద్యాన పంటలకు యూరియా వాడకంపై వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు సంయుక్తంగా అవగాహనా సదస్సులు నిర్వహిస్తే బాగుంటుందన్నారు. యూరియాపై ఎక్కువగా అపోహలు కొనసాగుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. యూరియా వచ్చిన తర్వాత ఈ-పోస్ త్వరగా కాకపోవడంతో సరఫరాలో ఆలస్యమవుతుందన్నారు. వెంటనే ఈ-పోస్ పని చేస్తే రైతులకు ఇబ్బంది ఉండదన్నారు. కొంతమంది డీలర్లు యూరియాను అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయిస్తున్న పరిస్థితి ఉందని కట్టడి చేయాలన్నారు. యూరియాతోపాటు డిఎపి కొనుగోలు చేయాలని ముడిపెట్టడం మంచిది కాదన్నారు.

మిర్చి, పత్తి పంటలకు యూరియా కొరత లేకుండా చూడాలి

చిర్రి బాలరాజు, పోలవరం ఎంఎల్‌ఎ

యూరియాకు సంబంధించి నియోజకవర్గంలో ఎటువంటి ఇబ్బందీ లేదు. కావాలనే అలజడి సృష్టిస్తున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పది వేల ఎకరాల్లో మిర్చి, పత్తి పంటలను రైతులు సాగు చేస్తారు. యూరియా కొరత లేకుండా చూడాలి. పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అంటూ అధికారులు ఇంకా పిలవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

డిమాండ్‌ను బట్టి యూరియా సరఫరా చేయాలి

సొంగా రోషన్‌కుమార్, చింతపూడి ఎంఎల్‌ఎ

యూరియాపై అధికారులు బాగా స్పందిస్తున్నారు. ఇబ్బంది లేకుండా వెళ్తోంది. డిమాండ్‌ను బట్టి సొసైటీలకు యూరియా సరఫరా జరగాలి. కొన్ని సొసైటీలకు సరిపడా యూరియా సరఫరా లేదు. ఆ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

రైతుల వద్ద యూరియా ఉంది..

చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎంఎల్‌ఎ

ఎరువుల కొరతపై రైతుల్లో అపోహలు ఉన్నాయి. దీంతో ముందుగానే ఎక్కువ బస్తాలు తీసుకుని ఇంట్లో పెట్టుకుంటున్నారు. రబీలో ఆ యూరియాను రైతులు ఉపయోగిస్తారు. రబీలో యూరియా అవసరం తగ్గుతుంది. ఆర్‌ఎస్‌కెల పరిధిలో నిర్మించిన గోడౌన్లను ఉపయోగించుకోవాలి.

పుష్కలంగా యూరియా.. బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు.. ★ ★ ★

నాదెండ్ల మనోహర్, ఇన్‌ఛార్జి మంత్రి

జిల్లాలో గతేడాదికన్నా ఈ ఏడాది ఎక్కువ యూరియా సరఫరా జరిగిందని ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అధికారుల్లో సమన్వయ లోపం కారణంగా చిన్నపాటి ఇబ్బందులు ఉన్నాయన్నారు. యూరియాను బ్లాక్ మార్కెటింగ్ చేస్తే పీడీ యాక్ట్ కేసులు పెడతామన్నారు. ఇప్పటికే 12 కేసులు నమోదయ్యాయని, ఇక నుంచి పీడీ యాక్ట్ కింద కేసులు పెడతారని అన్నారు. 530 కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ జరుగుతుందన్నారు. 29 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాకు 32,750 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. రెండు రోజుల్లో మరో 157 మెట్రిక్ టన్నుల యూరియా రాబోతుందని, జిల్లాలో 2,327 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని అన్నారు. ప్రతి బస్తా రైతులకు అందిస్తామన్నారు. మిర్చి, పత్తిపంటకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు అందుబాటులో ఉండేలా యూరియా విక్రయించే ఏజెన్సీల వద్ద కాల్‌సెంటర్ల ఫోన్ నెంబర్లు బోర్డులు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఎరువులకు సంబంధించి కావాలనే రైతుల్లో అలజడి సృష్టిస్తున్నారని తెలిపారు. గతేడాది ఖరీఫ్‌లో 33,762 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, ఈ ఏడాది ఇప్పటికే 30,557 మెట్రిక్ టన్నుల సరఫరా జరిగిందన్నారు. పామాయిల్ రైతులకు యూరియా ఎంత వాడాలో అధికారులు బాధ్యత తీసుకుని అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖాధికారి రామ్మోహన్‌రావును ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఓరియంటల్ ప్రోగ్రాంలు నిర్వహించాలన్నారు. యూరియా సరఫరాలో ఎక్కడా పొరపాటు జరగకూడదన్నారు. ఈ-పోస్ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎక్కడైనా సమస్య వస్తే సొసైటీ అధ్యక్షులు వెంటనే అధికారులకు తెలపాలన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించిన సమావేశం ఈ నెల 12న కాకినాడలో జరుగుతుందన్నారు. గతేడాది 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఈ ఏడాది 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. ఊహించని విధంగా కొనుగోలు ప్రక్రియ ఉంటుందన్నారు. అధికారులు బాగా పని చేస్తున్నారని, సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. 20 శాతం ఉద్యాన పంటల పెంపుపై ఎంఎల్‌ఎ చింతమనేని బాగా కృషి చేశారని కితాబు ఇచ్చారు.

ప్రొఫెసర్‌పై విద్యార్థి చాకుతో దాడి

ట్రిపుల్ ఐటీలో ఘటన

విద్యార్థి అరెస్టు, ప్రొఫెసర్‌కు తప్పిన ప్రాణాపాయం



గాయపడిన ప్రొఫెసర్ గోపాలరాజు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రొఫెసర్‌పై ఎంటెక్ విద్యార్థి చాకుతో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. దీనికి సంబంధించి స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం వడ్డిగూడేనికి చెందిన మజ్జి వినయ్ పురుషోత్తం ఎంటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సెకండ్ సెమిస్టర్ పరీక్షకు హాజరయ్యేందుకు పరీక్షా హాలులోకి వెళ్లాడు. అయితే అక్కడ విధుల్లో ఉన్న ప్రొఫెసర్ అనే విద్యార్థి ప్రొఫెసర్ గోపాలరాజు అటెండెన్స్ తక్కువ ఉండటంతో పురుషోత్తంను పరీక్షా హాలులోకి అనుమతించలేదు. హెచ్‌ఒడి నుంచి అనుమతి తెచ్చుకోవాలని సూచించారు. అయితే కొద్దిసేపటికే పరీక్షా హాలులోకి వెళ్లి కూర్చున్న పురుషోత్తంను గోపాలరాజు మరోసారి అనుమతి గురించి ప్రశ్నించగా హెచ్‌ఒడి అనుమతిచ్చారని తెలిపాడు. దీనిపై గోపాలరాజు హెచ్‌ఒడికి ఫోన్ చేయగా పురుషోత్తం తన వద్దకే రాలేదని, ఎటువంటి అనుమతీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ పురుషోత్తం పరీక్షా హాలు నుంచి వెళ్లకపోవడంతో గోపాల్‌రాజు సెక్యూరిటీ సిబ్బందిని పిలిచే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ఒక్కసారిగా విద్యార్థి పురుషోత్తం చాకుతో గోపాలరాజుపై దాడి చేశాడు. ఈ దాడిలో గోపాలరాజు భుజంపైనా, చేతిపైనా, వీపుపైనా గాయాలయ్యాయి. పక్కనే ఉన్న మిగిలిన విద్యార్థులు అప్రమత్తమై పురుషోత్తంను నిర్బంధించి, గోపాలరాజును హుటాహుటీన ఆస్పత్రికి తరలించారు. గోపాలరాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ప్రొఫెసర్‌పై దాడికి తెగబడ్డ ఎంటెక్ ఫస్టియర్ విద్యార్థి పురుషోత్తంను అరెస్టు చేసినట్లు నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ తెలిపారు. అటెంప్ట్ టు మర్డర్ కేసు నమోదు చేశామని వివరించారు.

దాడి దురదృష్టకరం

ట్రిపుల్ ఐటీలో సోమవారం చోటుచేసుకున్న ఘటన దురదృష్టకరమని ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ అన్నారు. ఆయన సోమవారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ తరగతులకు అటెండ్ కాకపోవడంతో అటెండన్స్ సరిపోక ఎంటెక్ విద్యార్థి వినయ్ పురుషోత్తంను పరీక్షకు ప్రొఫెసర్ గోపాలరాజు అనుమతించలేదన్నారు. దీంతో పురుషోత్తం ఆపిల్ కోసే చాకుతో అనుకోని దాడి చేయడం అనూహ్యంగా చోటుచేసుకుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.



ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంఎల్‌ఎలు సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్, ప్రముఖులు

పత్రికలు వాస్తవాలు వెలికితీయాలి

ప్రజాశక్తి వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు

పత్రికలు ప్రజలకు మేలు చేసే సమాచారం అందిస్తూ, వాస్తవాలు వెలికి తీయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా ప్రచురించిన చింతలపూడి నియోజకవర్గ ప్రత్యేక సంచికను ఆయన కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ప్రత్యేక సంచిక తీసుకొచ్చిన ప్రజాశక్తి సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు ఉండాలని, ఆ దిశగా ప్రజాశక్తి మంచి కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చి ప్రజలకు మేలు చేసేందుకు ప్రజాశక్తి మరింత సమర్థవంతంగా పని చేయాలన్నారు. భవిష్యత్తులో ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుతోపాటు ప్రజాశక్తి జిల్లా మేనేజర్ పి.నారాయణరాజు, స్టాఫ్ రిపోర్టర్ పి.గంగరాజు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి వై.సీతారాం, డివిజన్ ఇన్‌ఛార్జీలు ఎం.సాంబమూర్తి, జి.మాణిక్యాలరావు, విలేకరులు ఎం.రవి, వి.శ్యాంబాబు పాల్గొన్నారు.

సమసమాజం కోసం పరితపించిన సీతారాం ఏచూరి

ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం నేతలు బలరాం, రవి



ఏచూరికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమాజంలో అంతరాలు పోవాలని, పేదల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కాలని సిపిఎం సీనియర్ నేత, పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నిరంతరం తపించేవారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ఉద్దరాజు రామం భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి బలరాం, రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి 1952లో మద్రాసులో స్థిరపడిన తెలుగు కుటుంబంలో జన్మించారని, జాతీయోద్యమ భావాలు, దేశభక్తి భావాలు ఏర్పరుచుకున్న వ్యక్తి అని కొనియాడారు. భారతజాతి, తెలుగు జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డల్లో ఆయన ఒకరన్నారు. ప్రజలంతా సమానంగా బతకాలనే ఉన్నత ఆశయంతో జీవించారన్నారు. 1974లో ఎస్‌ఎఫ్‌ఐ నుంచి తన ప్రస్థానం మొదలైందని, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యునిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఎంపీగా తన బాధ్యతలు చాలా సమర్థవంతంగా నిర్వర్తించారన్నారు. దేశ రాజకీయాల్లో ఏచూరికి ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. సోషలిజం మాత్రమే ప్రత్యామ్నాయమనే భావజాలాన్ని విస్తృతంగా తీసుకెళ్లడంలో కీలకపాత్ర వహించారన్నారు. దేశంలో లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో సిపిఎంను చురుగ్గా నడిపించడంతోపాటు లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల్ని ఐక్యం చేయడంలో ఆయన క్రియాశీలక పాత్ర మరువలేనిదని కొనియాడారు. సిపిఎం శ్రేణులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని పేదల సమస్యలపై పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, జిల్లా నాయకులు ఎం.జీవరత్నం, ఎస్.మహంకాళిరావు, తామా ముత్యాలమ్మ, పి.మంగరాజు, పి.సూర్యారావు, గుడిపాటి నరసింహారావు, పంపన రవికుమార్, శ్యామలారాణి, అరుణకుమారి, కనకారావు, గోపీ, ఇస్సాక్, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

సోషలిజం ద్వారానే పేదరిక నిర్మూలన

ఆర్‌ఎస్ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - యలమంచిలి

సోషలిజం ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. సోమవారం మండలంలోని చించినాడలో ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సభ సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా అమరవీరుల స్మారక స్తూపంపై జెండాను మంతెన సీతారాం ఆవిష్కరించగా, ఆర్‌ఎస్ చిత్రపటానికి బలరాం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్త సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై విధించిన అధిక సుంకాలను తట్టుకోలేని ప్రధాని మోడీ చైనా వెళ్లి ఆ దేశ అధ్యక్షునితో మంతనాలు జరిపారని, అయితే మోడీ ఒక మాట కూడా మాట్లాడకపోవడం చూస్తున్నామని తెలిపారు. అమెరికా చైనాపై విధించిన సుంకాలను చైనా ధైర్యంగా ఎదుర్కొని మీరు మాపై సుంకాలు పెంచితే మేము కూడా పెంచుతామని ఎదురు నిలిచిందని, అదే కమ్యూనిస్టు దేశం గొప్పతనమని తెలిపారు. పాలకపక్షంగా ఉన్న చైనాలో ఎన్నో అద్భుతాలు చూస్తున్నామని, అదేవిధంగా మనదేశంలోని కేరళ రాష్ట్రంలో ఉన్న కమ్యూనిస్టులు ఆ రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు విద్య, వైద్యం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని, అది కమ్యూనిస్టుల వల్లే సాధ్యమవుతుందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బలరాం మాట్లాడుతూ సిపిఎం సీనియర్ నేత మాజీ, ఎంఎల్‌ఎ రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్‌ఎస్) స్ఫూర్తితో ప్రజా పోరాటాలు కొనసాగించాలన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం దఫదఫాలుగా అమ్మేస్తూ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నోరు మెదపడం లేదని, ప్రశ్నిస్తానని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రశ్నించడమే మర్చిపోయారని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల కారణంగానే 11 సీట్లకు పరిమితమయ్యారని, అదే విధానాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలు చేస్తోందని విమర్శించారు అధికారంలోకి రాకముందు కరెంటు ఛార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం కంటే ఛార్జీలు అధికంగా పెంచుతూ ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నం చేయడం దారుణమన్నారు. వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేస్తూ తమ బాధ్యత నుంచి తప్పుకోవాలని చూస్తున్నారని, మరోపక్క ఆరోగ్యశ్రీ ద్వారా అందరికీ ఉచితంగా వైద్యం అందిస్తామని చెబుతున్న ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో చాలా వ్యాధులకు వర్తింపు లేకపోవడంతో అనేక లక్షల మంది లక్షలు పోసి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వం మారింది గాని విధానాల్లో మార్పు లేదని ఇటువంటి సమస్యలపై భవిష్యత్తులో సిపిఎం నిర్వహించే పోరాటాలకు ప్రజల సహకారం కావాలని పిలుపునిచ్చారు. చించినాడ గ్రామాభివృద్ధిలో ఆర్‌ఎస్ పాత్ర కీలకమని సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు అన్నారు. 65 సంవత్సరాలు పాటు పంచాయతీ, సొసైటీలో అప్రతిహతంగా కమ్యూనిస్టుల పాలన సాగిందని, ఫలితంగా మంచి అభివృద్ధి చెందిందని అన్నారు. అటువంటి నాయకుడిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ చించినాడ గ్రామంలో ఎస్‌సి, బిసి ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఐకమత్యం చేసి అన్నదమ్ముల వలె మెలిగేలా ఆర్‌ఎస్ ఎంతో కృషి చేశారన్నారు. అనేక భూ పోరాటాలకు అండగా నిలిచి పేదలందరికీ భూములు పంచే విధంగా ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ ఆర్‌ఎస్ హయాంలో చించినాడలో ఆదర్శపాలన సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, సిపిఎం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, ఐద్వా మండల కార్యదర్శి జిల్లెల్ల ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు ఇవ్వాలి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి



మాట్లాడుతున్న గోపీమూర్తి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వాలని, ఆర్థికాంశాలపై ప్రభుత్వం మౌనంగా ఉండటం బాధాకరమని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి అన్నారు. యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆది, సోమవారాల్లో స్థానిక యుటిఎఫ్ భవనంలో జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.ముస్తఫ్‌ఆలీ అధ్యక్షతన జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ కార్యదర్శి నివేదిక, ఆర్థిక నివేదిక ఆర్.రంగమోహన్, మహిళా ఉద్యమ నివేదిక బి.సుధారాణి, ఇతర నివేదికలను ఎంవి.శ్యాంబాబు, బేతాళ రావు ప్రవేశపెట్టారు. వీటిపై 25 మండలాల నుంచి వచ్చిన కౌన్సిల్ మెంబర్లు చర్చించి ఆమోదించారు. రాష్ట్రస్థాయి అంశాలను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి వివరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోపీమూర్తి మాట్లాడుతూ గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పిఇటి, పండిట్ పోస్టులు నూరుశాతం అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. మరో ముఖ్యఅతిథి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అనేక యాప్‌ల ద్వారా బోధనేతర పనులు అప్పగించారని, వాటిని రద్దు చేయకపోతే సెల్‌డౌన్ ప్రకటించాల్సి ఉంటుందని తెలిపారు. పిఆర్‌సి, డిఎ బకాయిలు, పిఎఫ్ లోన్లు, పిఎఫ్ ఫైనల్ పేమెంట్లు తదితర అంశాలు తక్షణమే పరిష్కరించాలన్నారు. దీనికోసం 'యుటిఎఫ్ రణభేరి' పేరిట రాష్ట్రవ్యాప్తంగా బైక్ జాతా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నేతలు ఎం.విక్టర్, అల్లాడి రాజు, ఎం.రాంబాబు, అనురాధ, దేవానందరావు, శ్రీధర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలి

విధులు బహిష్కరించి ఏలూరు సర్వజన ఆస్పత్రి శానిటేషన్ వర్కర్ల నిరసన



నిరసన తెలుపుతున్న శానిటేషన్ వర్కర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమకు రావాల్సిన జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న పది నెలల పిఎఫ్ వెంటనే జమ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏలూరు సర్వజన ఆస్పత్రిలో శానిటేషన్ వర్కర్లు ఎఐటియుసి ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, జిల్లా కార్యదర్శి వి.దత్తాత్రేయ మాట్లాడుతూ ఫస్ట్ ఆబ్జెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సర్వీసెస్‌కు చెందిన కాంట్రాక్టర్ పదో నెల నుంచి పిఎఫ్, మూడు నెలల జీతాల బకాయిలు ఇవ్వట్లేదని, వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో డ్రెయినేజీ వ్యవస్థ, శానిటేషన్ పైప్‌లైన్లు, వాటర్ పైపులైన్లు సరిగ్గా లేవని, వాటిని బాగు చేయించాలని పలుసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవట్లేదని, సౌకర్యాలు సరిగ్గా లేకుండా సిబ్బంది పారిశుధ్యం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. వెంటనే పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఎఐటియుసి జిల్లా హాస్పిటల్ బ్రాంచ్ నాయకురాలు పి.విజయ, పలువురు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, డిమాండ్ చేస్తూ ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో సోమవారం శానిటరీ సిబ్బంది విధులు బహిష్కరించి ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఐటియుసి మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్లకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాంట్రాక్ట్ ఏజెన్సీని తొలగించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించి నేరుగా ప్రభుత్వమే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు జంపన వెంకటరమణరాజు, సుంకర రాధాకృష్ణ, మేరీ, ప్రభావతి, చంద్రకళ, శ్రీను, దుర్గారావు, కార్మికులు పాల్గొన్నారు.

డిసిఎంఎస్ వద్ద యూరియా కోసం బారులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు లోని డిసిఎంఎస్ వద్ద యూరియా కోసం సోమవారం రైతులు బారులు తీరారు. యూరియా ఇవ్వడంలో సిబ్బంది కొంత నిర్లక్ష్యం వహించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి టిఫిన్ కూడా చేయకుండా వచ్చి లైన్లో నిలుచుని ఉన్నామని, అయితే వెనక వచ్చిన వారికి ముందు ఇచ్చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. తాము రైతులమేనని వరుస పద్ధతిలో యూరియా ఇవ్వాలని కోరారు. మండల వ్యవసాయాధికారి జీవన సంధ్య మాట్లాడుతూ ఏలూరులో యూరియా కొరత ఏమీ లేదన్నారు. ఏలూరు నగరం పెదపాడు, దెందులూరు మండలాలకు దగ్గరగా ఉండడంతో చుట్టుపక్కల ఉన్న రైతులు సైతం ఇక్కడికి వచ్చి యూరియా తీసుకోవడంతో కొంత రద్దీ ఏర్పడిందని అన్నారు. ఈ ఆరు రోజుల్లో 48.5 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వచ్చిందన్నారు. మంగళవారం సాయంత్రానికి 18 టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. యూరియా కోసం వచ్చేవారు పాస్ పుస్తకాలు, కౌలుకార్డు జిరాక్స్ కాపీ వంటివి కచ్చితంగా తీసుకురావాలని, యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విస్తీర్ణం బట్టి యూరియాను అందిస్తున్నట్లుగా తెలిపారు.

ఎరువుల బస్తాల బరువులో తేడాలు

ఏలూరు డిసిఎంఎస్ ఎరువుల దుకాణంలో ఎరువుల బస్తా బరువులో తేడాలు గమనించినట్లు తూనికలు, కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు తెలిపారు. మొత్తం 50 ఇండియన్ పొటాష్ బస్తాల బరువులను పరిశీలించగా, 50 కిలోలకు 300 నుంచి 700 గ్రాముల వరకు తేడా ఉందని గమనించామని తెలిపారు. ఆ బరువులో తేడా మ్యానుఫ్యాక్చరర్స్ దగ్గర నుంచి వస్తుందని, దీనిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

10న జెడ్‌పి స్థాయి సంఘాల సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుండి ఏలూరు జిల్లా పరిషత్ కార్యాల యంలో నిర్వహిస్తామని జెడ్‌పి సిఇఒ శ్రీహరి ఒక ప్రకట నలో తెలిపారు. సంబంధిత సభ్యులు, ఆహ్వానితులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైకరం తోటబడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మద్దాల చక్రవర్తిను గ్రామస్తులు, ఎస్ఎంసి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు పుప్పాల నరసింహారావు, ఎస్ఎంసి ఛైర్మన్ పి.సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ మల్లేశ్వరి, ఉపాధ్యాయులు, సభ్యులు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరు : మండలంలోని మానూరులో మండల ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తేర ప్రసాద్ మాస్టార్ను, ఉపాధ్యాయిని తాలాడ అరుణ, ఎస్ఎంసి ఛైర్మన్ పేరం రాము శిరీష, తేర ప్రభుదాసు, తేర జగదీష్, అంగన్వాడీ టీచర్ కడియం కుమారి, పిల్లలు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాదేపల్లి మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగతోట సునందకుమారి, యు.గంధర్వరావు, వి.రాధాదేవి, ఎం.శ్రీలక్ష్మి, శివజ్యోతి పాల్గొన్నారు.

అర్హులకు పెన్షన్లు అందించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అర్హులైన వృద్ధులకు, వితంతువులకు పెన్షన్లు అందించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒకు పలువురు వితంతువులు వినతిపత్రం అందించారు. వారికి న్యాయం చేయాలని ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. మహిళలు సచివాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించి అర్హులందరికీ పెన్షన్ అందించాలని, లేకపోతే రెడ్డి గణపవరం సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

వ్యాధుల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముదినేపల్లి

సమాజంలో ప్రతిఒక్కరూ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ముదినేపల్లి పిహెచ్‌సి వైద్యాధికారిణి శాంతిశ్రీ అన్నారు. మండలంలోని వడాలిలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో శాంతిశ్రీ పాల్గొని మాట్లాడారు. హెచ్ఐవి, క్షయ వ్యాధుల వ్యాపక మార్గాలు, వ్యాధుల లక్షణాలు గురించి వివరించారు.

ఎఎంసి ఛైర్‌పర్సన్‌కు సత్కారం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన ఛైర్‌పర్సన్‌గా నియమితులైన చీదరాల దుర్గా పార్వతి మధుబాబు దంపతులను కాపు సంక్షేమ సంఘం పట్టణ నాయకులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపి కాపు సంఘం తరపున ఘనంగా సత్కరించారు. చింతలపూడి ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా కాపులకు ప్రాముఖ్యతను ఇచ్చిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కు కాపు సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రయోగాలు పరిశీలన

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బిఎస్‌సి మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు విజయవాడ పిబి సిద్ధార్థ కళాశాలలో ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ (ఐజి సిఎఆర్) వారు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సోమవారం విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.వెంకటేశులు రెడ్డి, డాక్టర్ పి.బాబు, టి.గాబ్రియేల్ వ్యవహరించారు. ఎగ్జిబిషన్ ఎంతగానో ఉపయోగ పడిందని, అనేక విషయాలను తెలుసుకున్నామని విద్యార్థులు తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు విద్యార్థులను, అధ్యాపకులను ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డి.రెడ్డయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి, అధ్యాపకులు నిర్మల జ్యోతి అభినందించారు.

శ్మశానవాటిక ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సంకల్పంతో వలసపల్లి గ్రామానికి శ్మశానవాటిక స్థలం ఏర్పరచుకున్నట్లు టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని వలసపల్లి గ్రామంలో శ్మశానవాటిక లేకపోవడంతో పార్టీ గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర, గ్రామ సర్పంచి చలసాని దామోదరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు మంత్రి పార్థసారధి దృష్టికి తీసుకెళ్లారు. ఖాళీ పోరంబోకు స్థలంలో శ్మశానవాటికను ఏర్పాటు చేసుకోండని, తహశీల్దార్‌తో, ఉన్నతాధికారులతో తాను మాట్లాడతానని చెప్పారు. గ్రామంలో 30 ఏళ్లుగా అడవిలా కంప అల్లుకుపోయి ఉన్న స్థలాన్ని ప్లొక్లెయిన్ ద్వారా బాగుచేసి గ్రామస్తులకు అప్పగించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ముసునూరు : ఆగిరిపల్లి శ్రీ శోభనాచల వ్యాఘ్రలక్ష్మీనరసింహస్వామి ప్రాంగణంలోని మండపంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో ముసునూరు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రధానోపాధ్యాయులు కె.లక్ష్మీకుమారి తెలిపారు. ముసునూరు గురుకుల పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కలిసి ఆమె మాట్లాడుతూ జిల్లా పోటీల్లో ప్రథమ బహుమతి జి.హారిక, ద్వితీయ బహుమతి ఎల్.అను, తృతీయ బహుమతి కె.తపస్వి సాధించినట్లు చెప్పారు. సబ్ జూనియర్ కేటగిరీలో ద్వితీయ బహుమతి సౌజన్య, తృతీయ బహుమతి ఐశ్వర్య సాధించారని తెలిపారు.

250 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఆగిరిపల్లి : పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించటం ఎంతో అభినందనీయమని తోటపల్లి మాజీ సర్పంచి, టిడిపి బిసి సెల్ నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని తోటపల్లిలో ఎంఎం.చర్చి, క్రౌన్ గాస్పల్ మినిస్ట్రీస్ ఛారిటబుల్ ట్రస్టు, మదర్ థెరిస్సా ప్రెయర్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మందికి పలు రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు పాస్టర్ కాటూరి జాన్ సునీల్, పాస్టర్ రమేష్ పాల్‌లు తెలిపారు.

సమస్యలను పట్టించుకోరా..!


సర్పంచి, ఉప సర్పంచిని నిలదీసిన గూటాల వాసులు

ప్రజాశక్తి - పోలవరం

గూటాల పంచాయతీ ఐదో వార్డు మహాలక్ష్మిపేట గ్రామంలో మౌలిక వసతుల కొరత ప్రజల సహనాన్ని దాటింది. గ్రామస్తులు సోమవారం పంచాయతీ కార్యాలయానికి చేరుకుని సర్పంచ్, ఉప సర్పంచి, కార్యదర్శిని నిలదీశారు. కొత్త మోటార్ అమర్చి నెలరోజులు గడిచినా నీటి పరీక్ష జరగకపోవడంతో పైపులైన్ నుంచి మురికినీరు వస్తోందన్నారు. రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు రెండేళ్లుగా అలాగే ఉండిపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వీర్య పాలనను ఇక భరించబోమని గ్రామస్తులు సర్పంచిని నిలదీశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి వివరణ ఇస్తూ కొత్త మోటార్ నుంచి వచ్చే నీటిని ఇప్పటికే బుట్టాయగూడెం పరీక్షకు పంపించామని, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలపై అంచనాలు వేసి సర్పంచి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సర్పంచి స్పందిస్తూ సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పత్తివాడ శ్రీనివాసు, పత్తివాడ రాంబాబు, పులి నాగేశ్వరరావు, గిరిటీ సాయికిరణ్, పల్లె అప్పారావు, కల్లేపల్లి లక్ష్మి, సంసాని సూర్యకాంతం పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



నూజివీడులో..

నూజివీడు పట్టణ పరిధిలోని ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్లో సోమవారం ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐఐటి ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిఆర్ఒ డాక్టర్ లంకపల్లి రాజేష్, శ్రీసిద్ధార్థ కళాశాల సంస్కృత లెక్చరర్ పి.వకుళాదేవి అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల గ్రంథాలయాన్ని డాక్టర్ రాజేష్ ప్రారంభించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఇంగ్లీష్ ఎగ్జిబిషన్లు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపల్ మొక్కపాటి రుక్మిణి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: మండలంలోని లక్ష్మీపురం, ములగంలపల్లి పాఠశాలలో విద్యార్థులతో అక్షరాస్యతలో మొదటి "అ" ఆకృతి వేయించినట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.చెన్నారావు, ఉపాధ్యాయులు డి.బుల్లెమ్మ, ఎం.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పివివి.ప్రకాష్ ఆధ్వర్యంలో వెలుగు, అంగన్వాడీ, ఉపాధి హామీ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు శ్యామ్యులు, వెలుగు ఎపిఎం అరవిందమ్మ, మండల విద్యాశాఖాధికారి వెంకట్రావు, ఉపాధి హామీ ఎపిఒ నాగరాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాణి, వెలుగు సీసీలు, సిఎలు, అంగన్వాడీ టీచర్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 38 ఫిర్యాదులు వచ్చాయని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కూడా నిర్వహించారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఎస్‌పి సంబంధిత అధికారులకు ఫోన్లోనే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న ఫిర్యాదులపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వాటిని నిర్ణీత గడువులో పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సూచించారు. గడువులలో ఫిర్యాదులు పరిష్కారం కాకుంటే వెంటనే తనకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు

సీనియర్ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - ముసునూరు

గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో కనీసం వరుసగా ఐదేళ్లు పనిచేసిన సీనియర్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు ఎంఆర్‌సి భవనంలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి.పద్మకిషోర్, జి.రాంబాబు, హేమ, గంగుల నాగేశ్వరరావు, ఎం.శివనాగమణి, కొలకలూరి రాజు, కొప్పుల బాబూరావు, బెనర్జీ మాస్టర్ పాల్గొన్నారు.

హోమియో ఆసుపత్రికి స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురంలో హోమియో ఆసుపత్రికి స్థలం కేటాయించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఎస్‌డి.నాసర్ పాషా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ టి.సాయిబాబా, ఎంపిడిఒ నగరాజ కుమారిలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన టి.నరసాపురంలో ప్రభుత్వ హోమియో ఆసుపత్రి కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల రోగులు హోమియో చికిత్స ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందుతున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రికి శాశ్వత భవనం లేక పోవడంతో స్థానిక వెలుగు కార్యాలయంలో సేవలు అందిస్తోందన్నారు. అక్కడ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో లైట్లు, ఫ్యాన్లు లేక వర్షాకాలం, వేసవికాలంలో రోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవనం లేకపోవడంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో హోమియో ఆసుపత్రికి స్థలం కేటాయించి పక్కా శాశ్వత భవనం నిర్మించి రోగులకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు.

డిసెంబర్‌కు మెడికల్ కాలేజీ పనులు పూర్తి

మంత్రి కొలుసు పార్థసారధి ఆకస్మిక తనిఖీ

పనులపై మంత్రికి వివరించిన అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిని, ప్రభుత్వ మెడికల్ కళాశాలను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను కాంట్రాక్టర్లతో మంత్రి సమీక్షించారు. మెడికల్ కాలేజీ పనులు డిసెంబర్‌కు పూర్తవుతాయని కాంట్రాక్టర్లు మంత్రికి తెలిపారు. ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాల వివరాలను సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నామని, వాటిని త్వరలోనే ఏర్పాటు చేసి రోగులకు ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సావిత్రి, హాస్పటల్ సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

'రైతులకు అందుబాటులో యూరియా'

ప్రజాశక్తి - చింతలపూడి


మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

రైతులకు సరిపడా యూరియా అన్ని చోట్ల ఉందని, వైసిపి ప్రభుత్వం కావాలని అసత్య ప్రచారాలు చేస్తుందని, రైతులెవరూ నమ్మొద్దని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 331 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని, మంగళవారం ఇంకా అదనంగా వస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో సెప్టెంబర్ ఎనిమిదో తేదీ వరకు 3250 మెట్రిక్ టన్నులు యూరియా సొసైటీలకు ఇచ్చినట్లు తెలిపారు. తొమ్మిదో తేదీన వైసిపి ప్రభుత్వం రోడ్డు మీదకు వచ్చి గందరగోళం చేయడానికి చూస్తుందని, రైతులెవరూ పట్టించుకోవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎర్రంపల్లి సొసైటీ ఛైర్మన్ తాళ్లూరు చంద్రశేఖర్ రెడ్డి, సీతానగరం సొసైటీ ఛైర్మన్ ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : సొసైటీ ద్వారా రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉందని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఛైర్మన్ దేవినేని శ్రీధర్ అన్నారు. మండలంలోని ముసునూరు సొసైటీ ద్వారా రైతులకు యూరియా అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబి, వ్యవసాయ శాఖ సిబ్బంది దుర్గాబాయి, సొసైటీ కార్యదర్శి దాసిరెడ్డి లక్ష్మణకుమార్, రైతులు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : రైతులకు సరిపడా యూరియా అందిస్తామని మండల అగ్రికల్చర్ ఎఒ పి.సమీరజా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలేరుపాడు మండలానికి 25.2 టన్నుల యూరియా కేటాయించామని మేడిపల్లి రైతు సేవా కేంద్రం వద్ద 12.6 టన్నుల యూరియా, రామవరం రైతు సేవా కేంద్రం వద్ద 12.6 టన్నుల యూరియా మార్క్ ఫెడ్ ద్వారా కేటాయించామని, సోమవారం అర్ధరాత్రికి మండలానికి చేరుకుంటుందని, మంగళవారం నుంచి రైతులకు సరఫరా చేస్తామని తెలిపారు.

ఉంగుటూరు : యూరియా సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేదని, ఉంగుటూరు మండలంలో ఉన్న ఎనిమిది సొసైటీల సేల్స్ పాయింట్స్‌లో అన్ని చోట్ల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 150 ఎంటిఎస్ యూరియా మండలంలో అందుబాటులో ఉందని తెలిపారు.

సాగుకు సరిపడా యూరియా రైతులకు అందించండి

వేలేరుపాడు రూరల్ : రైతులకు, కౌలు రైతులకు సాగుకు సరిపడా యూరియా అందించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండి.మునీర్, సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము, రామవరం సర్పంచి పిట్టా ప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్ పంటకు ప్రతి రైతుకూ యూరియాను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎద్దేవా చేశారు. సకాలంలో ఎరువులు అందించి రైతులకు న్యాయం చేయాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

ఏలూరు అర్బన్ : రైతులకు ఎరువులను సరిపడా అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎరువులను సక్రమంగా అందించాలని, బ్లాక్ మార్కెట్లో ఎరువులు అమ్మకాలను అరికట్టాలని, రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలని, రైతుల సమస్యలు తీరేంతవరకు పోరాడుతామని నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

జంగారెడ్డిగూడెం : రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయాలని, ఎరువులు బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణరాజు డిమాండ్ చేశారు. ఎరువుల కొరత నిరసిస్తూ సోమవారం సిపిఐ జంగారెడ్డిగూడెం మండల సమితి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ స్లీవజోషికి వినతిపత్రం అందించారు.

నూజివీడు టౌన్ : మండలంలోని తుక్కులూరులో ఉన్న పిఎసిఎస్ యూరియా పంపిణీ కార్యక్రమాన్ని నూజివీడు తహశీల్దార్ బద్రు, మండల వ్యవసాయాధికారి చెన్నారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి చెన్నారావు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 50 మెట్రిక్ టన్నుల యూరియా సొసైటీల్లో, ప్రయివేట్ డీలర్స్ వద్ద అందుబాటులో ఉందని, మరో 25 టన్నుల యూరియా కూడా అదనంగా ఎపి మార్క్‌ఫెడ్ ఏలూరువారికి ఇండెంట్ పెట్టినట్లు తెలిపారు.

చింతలపూడి : యూరియా కొరతను నివారించాలని సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు అన్నారు. ఈ మేరకు సోమవారం సిపిఐ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

టి.నరసాపురం : రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతపై వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న అన్నదాత పోరు పోస్టర్లను సోమవారం వైసిపి మండల నాయకులు దేవరపల్లి ముత్తయ్య ఇంటివద్ద వైసిపి మండల కన్వీనర్ ఎస్‌విపికెహెచ్.శ్రీనురాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి మధు మాట్లాడారు.

కుక్కునూరు : పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం పట్టణంలో మంగళవారం పాత బస్టాండ్ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు వైసిపి మండలాధ్యక్షులు తాండ్ర రాజేష్ తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు ఉదయం 7:30 గంటలకు కుక్కునూరు చేరుకోవాలని చెప్పారు. అక్కడి నుండి అందరూ కలిసి జంగారెడ్డిగూడెం వెళ్లనున్నట్లు తెలిపారు.

దెందులూరు : యూరియా, తదితర ఎరువులను సక్రమంగా అందించాలని కోరుతూ సోమవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు, వ్యవసాయ కార్మికులు నిరసన తెలిపారు. రైతు సంఘం, సిపిఐ రాష్ట్ర పిలుపులో భాగంగా ఎఐకెఎస్, బికెఎంయు ఏలూరు మండల సమితుల ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహశీల్దార్‌కు నాయకులు వినతిపత్రం అందించారు.

జీలుగుమిల్లి : ఎరువుల కొరత నివారించి రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించాలని, ఎరువులు బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి మండలాధ్యక్షుడు సందా ప్రసాద్ డిమాండ్ చేశారు. అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, నాయకులు ఉప్పల రాంపండు, రవి, సాయి, వెంకట్రావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
45వ వార్షికోత్సవ
ప్రత్యేక అనుబంధం
ఏలూరు జిల్లా
ఆగస్టు 2025
16 పేజీలు
Advt.feature 4

సేవాగుణం.. స్పష్టమైన విజన్

సొంగా సొంతం



- శరవేగంగా వంద పడకల హాస్పటల్ నిర్మాణ పనులు
- రోడ్ల అభివృద్ధికి కృషి
- హామీలు అమలు చేస్తున్నాం
- పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పనే లక్ష్యం
- చింతలపూడి ఎంఎల్ఎ

సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

'సేవాగుణం.. స్పష్టమైన విజన్‌తో ప్రజాప్రతినిధి పనిచేస్తే నియోజకవర్గ అభివృద్ధి సుసాధ్యమవుతుంది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల సంపూర్ణ అమలుతోపాటు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కార్యాచరణ, తన దృష్టికొచ్చిన సమస్య పరిష్కారమయ్యే వరకూ నిరంతర తపన ఇది ప్రజాప్రతినిధికి నిజమైన రూపం. ఆ కోవలోనే చింతలపూడి ఎంఎల్ఎ ..2లో

మరో అడుగు ముందుకు

ప్రతి అక్షరాన్ని ప్రజల పక్షం చేసి ప్రజాశక్తి సాగిస్తున్న అక్షర సమరానికి 45 ఏళ్లు! స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి, సమతా ప్రపంచపు వెలుగులతో ప్రజాశక్తి ఉజ్వల ప్రస్తానాన్ని సాగిస్తోంది. భూమి కోసం, భుక్తి కోసం, అభ్యున్నతి కోసం తెలుగు ప్రజలు కదలిన ప్రతిసారీ ప్రజాశక్తి వారి గళమైంది. పోరాట పతాక అయ్యింది. వారికి కష్టమొస్తే అండగా నిలిచింది. వారిని కదిలిం చింది.! పాలకులు వికృత పోకడలు పోతే నిలువెత్తు ప్రశ్నయైంది. కుల వివక్షను నిలదీసింది. మహిళల హక్కుల కోసం నినదించింది! కార్పొరేట్ల ఖజానాలు నింపడమే లక్ష్యంగా అమలవుతున్న నయా ఉదార వాద ఆర్థిక విధానాల గుట్టు విప్పతూ.. మతోన్మాదుల, కార్పొరేట్ శక్తుల మధ్య నెలకొన్న రహస్య బంధాన్ని బట్టబయలు చేయడంలో ప్రజాశక్తిది ఎప్పుడూ ముందడుగే! మతోన్మాదంపై రాజీ లేని పోరాటం ప్రజాశక్తిది! విశాఖ ఉక్కు కోసం, విభజన హామీల అమలు కోసం, ప్రత్యేకహోదా సాధన కోసం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం నినదించేది, నిలదీసేది, అక్షర బాణాలు సంధించేది ప్రజాశక్తి మాత్రమే! కరేడు నుండి ఇటు శ్రీకాకుళం అటు రాయల సీమ వరకు భూ పందేరాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల ఏకైక గళం ప్రజాశక్తి! అందుకే... ప్రతి అక్షరం ప్రజల పక్ష మన్నది నినాదం మాత్రమే కాదు. ఆచరణలో సైతం ప్రజాశక్తి అక్షరాల ప్రజల శక్తే!

... పూర్తి కథనం 2వ పేజీలో

సేవాగుణం.. స్పష్టమైన విజన్ సొంగా సొంతం

(మొదటి పేజీ నుంచి)

సొంగా రోషన్‌కుమార్ నిరంతరం ప్రజలు, కార్యకర్తలతో మమేకమవుతూ నిధుల కోసం జిల్లా మంత్రి పార్థసారధి సలహాలు తీసుకుంటూ, ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ సహకారం తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు. నిరుద్యోగ యువతకు, ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పరిశ్రమల స్థాపనకు కృషి, పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారం, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తికి, కోకో ఉత్పత్తుల స్థానిక వినియోగం కోసం ఫ్యాక్టరీ నిర్మాణం, ప్రజా రవాణాకు అవసరమైన బస్సు డిపో ఏర్పాటుకు నిరంతరం కృషి సాగిస్తున్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి ఎంఎస్ఎంఇ పార్క్ 72 ఎకరాల్లో నియోజకవర్గంలోని చింతలపూడి మండలం పట్టాయిగూడెంలో ఏర్పాటు, విద్యార్థుల కోసం పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. మెట్ట ప్రాంతంలో వంద పడకల హాస్పిటల్ త్వరగా పూర్తి చేసి, మెరుగైన వైద్యం అందించేందుకు నిరంతరం సమీక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఎంఎల్‌ఎగా ఏడాది పాలన పూర్తి చేసుకుని రెండో సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌ను ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూ చేసింది. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రశ్న: కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సంవత్సర కాలంలో చింతలపూడి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి ఏమిటీ, ఎన్ని నిధులొచ్చాయి?

ఎంఎల్‌ఎ: చింతలపూడి నియోజకవర్గంలో పెన్షన్ సొమ్ము పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు రూ.200 కోట్లు వచ్చాయి. నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బి రోడ్లు, సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.230 కోట్లు తీసుకొచ్చాను. సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. సిఎంఆర్‌ఎఫ్ కింద రూ.నాలుగు కోట్లు ఇచ్చాం. ఎల్‌ఒసి రూపంలో రూ.కోటి వరకూ ఇచ్చాం. అన్నదాత సుఖీభవ కింద నియోజకవర్గంలో రైతులకు రూ.25 కోట్లు లబ్ధి చేకూరింది. ఈ పథకం కింద ఎక్కువ లబ్ధి పొందిన నియోజకవర్గం జిల్లాలో చింతలపూడినే. తల్లికి వందనం కింద నియోజకవర్గంలో 33 వేల మంది విద్యార్థులకు రూ.60 కోట్ల సాయం అందింది. ఎన్‌ఆర్‌ఇజిఎస్ మొదటి ఫేజ్‌లో రూ.25 కోట్ల నిధులతో రోడ్లు నిర్మించాం. సెకండ్ ఫేజ్‌లో రూ.5 కోట్ల వ్యయంతో పనులు చేపట్టబోతున్నాం. పంచాయతీరాజ్ నిధులు రూ.కోటితో పనులు నిర్వహించాం.

ప్రశ్న: సూపర్ సిక్స్ హామీల అమలు తీరు ఎలా ఉంది?

ఎంఎల్‌ఎ: ఎన్నికల్లో కూటమి హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తోంది. అదే సమయంలో సిఎం చంద్రబాబు అభివృద్ధిపైనా దృష్టి సారించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, అమరావతి పనులు వేగవంతానికి ప్రత్యేక కృషి చేస్తున్నారు. మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పేరుతో సొమ్ము వారి ఖాతాల్లో వేశారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం మోయలేని విధంగా ఉన్నా వెనుకడుగు వేయడం లేదు. అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశారు. మరోపక్క మిర్చి, కోకో, పామాయిల్, మామిడి, వరి రైతులకు మద్దతు ధర కల్పిస్తూ, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు మంత్రులు నారా లోకేష్, పవన్ కల్యాణ్ పెద్దమొత్తంలో పెట్టుబడులు తీసుకొస్తున్నారు. ప్రధాని సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.

ప్రశ్న: ఇరిగేషన్ పనులకు సంబంధించి నిధులు ఖర్చు పెట్టారా?

ఎంఎల్‌ఎ: ఇరిగేషన్ సెక్టార్‌లో ఒఅండ్‌ఎం పనుల కింద రూ.కోట్లు వెచ్చించి పనులు నిర్వహిస్తున్నారు. చెరువులు అభివృద్ధి చేస్తున్నాం. రైతులకు ఉపయోగపడే విధంగా వారి సలహా మేరకు చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: దేవాలయాల అభివృద్ధికి నిధులొచ్చాయా, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నారా?

ఎంఎల్‌ఎ : కామవరపుకోట, చింతలపూడి తదితర ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధికి రూ.రెండు కోట్లు వచ్చాయి. జీలకర్రగూడెం బౌద్ధ గుహలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు పంపాను. ఇంకా మరికొన్నింటిపై దృష్టి పెట్టాను.

ప్రశ్న: చింతలపూడి నియోజకవర్గ రైతులకు 9 గంటలు నాణ్యమైన కరెంటు అందిస్తున్నారా? లోఓల్టేజీ సమస్యను ఎలా పరిష్కరిస్తున్నారు?

ఎంఎల్‌ఎ: వ్యవసాయానికి తొమ్మిది గంటలు, ఇళ్లకు 24 గంటలు విద్యుత్ అందించేలా ఆర్‌డిఎస్ నిధులతో పనులు జరుగుతున్నాయి. ఇప్పటికి సుమారు 40 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. నియోజకవర్గంలో కొత్తగా ఆరు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపదనలు పంపించాం. తడికలపూడిలో సూర్యఘర్ కింద యూనిట్ల ఏర్పాటు చేస్తున్నాం. అదే విధంగా ధాన్యం రైతులకు కొనుగోలు కేంద్రం ద్వారా 24 గంటల్లో వారి ఖాతాల్లో నగదు జమ చేసి, వారి ముఖంలో ఆనందం కళ్లారా చూశాం. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ కృషి మరువలేనిది.

ప్రశ్న: నియోజకవర్గంలోని కళ్ల చెరువు వద్ద గుండేరు, పట్టిన్నపాలెం వద్ద బైనేరు వాగుపై వంతెనల నిర్మాణ పరిస్థితి ఏమిటీ?

ఎంఎల్‌ఎ : ఆ రెండు వంతెనల నిర్మాణం కోసం రూ.12 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు గతంలోనే పంపించాం. మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు పంపించబోతున్నాం. ఇవి అత్యవసర వంతెనలు. వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాను. ఆడమిల్లి వంతెన కోసం నిధులు తీసుకొచ్చాం. పనులు వేగవంతం చేస్తున్నాం.

ప్రశ్న : ఆర్‌అండ్‌బి రోడ్లకు నిధులు ఎంతొచ్చాయి ? పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు?

ఎంఎల్‌ఎ: చింతలపూడి నియోజకవర్గంలో రోడ్ల అంశం కీలకంగా ఉంది. ఏలూరు - జంగారెడ్డిగూడెం, ఏలూరు - మేడిశెట్టివారిపాలెం, చింతలపూడి - కామవరపుకోట రోడ్లకు రూ.కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కోసం ఎదురుచూస్తున్నాం. తోచలక-కొణిచర్ల రోడ్డుకు రూ.4.80 కోట్లు నిధులొచ్చాయి. యర్రగుంటపల్లి-లక్ష్మీపురం రోడ్డు ఆరు కిలోమీటర్లలో 50 శాతం పూర్తయ్యింది. త్వరలో పనులు పూర్తవుతాయి. చింతలపూడి-రేచర్ల రోడ్డు పూర్తయ్యింది. ఎన్నో సంవత్సరాలుగా రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న బోయగూడెం-సీతానగరం రోడ్డు దాదాపు పూర్తయ్యింది. యర్రగుంటపల్లి వంతెన నుంచి రూ.80 లక్షలతో రోడ్ల మరమ్మతులు చేపట్టాం. చింతలపూడి నుంచి గురుభట్లగూడెం రోడ్డు వరకూ మరమ్మతులు చేపట్టి రోడ్డు నిర్మిస్తున్నాం.

ప్రశ్న : చింతలపూడిలో వంద పడకల హాస్పటల్ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారు?

ఎంఎల్‌ఎ: చింతలపూడిలో వంద పడకల హాస్పటల్ పనులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.4 కోట్లు మంజూరు చేయించాం. పనులు వేగంగా సాగుతున్నాయి. అక్టోబర్ మొదటి వారంలో పూర్తి చేస్తాం. చింతలపూడి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే లక్ష్యం. వంద పడకల హాస్పటల్ పనులు పూర్తయ్యి, అందుబాటులోకొస్తే అన్ని సదుపాయాలూ ఉంటాయి.

ప్రశ్న : చింతలపూడి ఎత్తిపోతల కాలువ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారు?

ఎంఎల్‌ఎ : మంత్రి నిమ్మల రామానాయుడుని నెలకోసారి కలుస్తున్నాను. ప్రభుత్వం కూడా దీనిపై దృష్టి పెట్టింది. కొన్ని చిక్కుముడులు ఉన్నాయి. త్వరలో అవి పరిష్కారమవుతాయి. రైతులకు న్యాయం జరిగేలా అన్ని చర్యలూ తీసుకుంటాం. ఈ సంవత్సరంలో రైతులకు శుభ వార్త వస్తుంది.

ప్రశ్న : నియోజకవర్గ కేంద్రం చింతలపూడిలో బస్సు డిపో ఏర్పాటు చేస్తున్నారా? పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?

ఎంఎల్‌ఎ: చింతలపూడిలో నూతన బస్సు డిపో ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశాను. బస్సు డిపో ఏర్పాటుకు నాలుగున్నర ఎకరాల భూమి అడిగారు. ప్రభుత్వ భూమిని చూపించాం. దీనిపై దృష్టి పెట్టాను. బస్సు డిపో ఏర్పాటు చేస్తే సుమారు వెయ్యి మంది యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ప్రశ్న : నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నారా? నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దొరుకుతాయా?

ఎంఎల్‌ఎ : నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నాను. చింతలపూడికి పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాను. అదే విధంగా ఎంఎస్ఎంఇ (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజస్ పార్క్)ను నియోజకవర్గంలో 70 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోనే చింతలపూడి నియోజకవర్గంలోనే మొదటిగా ఏర్పాటు చేస్తున్నారు. కోకో సాగులో రాష్ట్రంలోనే చింతలపూడి నియోజకవర్గం మొదటి స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో కోకో ఉత్పత్తుల వినియోగానికి చింతలపూడిలో కోకో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడును కోరాను. ఆయన సుముఖత వ్యక్తం చేశారు. పెట్టుబడుల కోసం యుకె, ఫారిన్ కంపెనీలతో మాట్లాడుతున్నాను. దీనివల్ల కొంతమందికి ఉపాధి దొరుకుతుంది.

ప్రశ్న : ప్రజలు, కార్యకర్తలు, నాయకుల సమస్యలు ఎలా తెలుసుకుంటున్నారు. వాటి పరిష్కారం ఎలా చేస్తున్నారు?

ఎంఎల్‌ఎ : ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నియోజకవర్గంలో ప్రజలు, కార్యకర్తలు, నేతలను కలుసుకోవడానికి అందుబాటులో ఉంటున్నాను. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకూ నేతలను కలుస్తున్నాను. కార్యకర్తలు, నేతలు ఇద్దరికీ ప్రాముఖ్యత ఇస్తున్నాను. కార్యకర్తలకు నాయకుల ద్వారానే పనులు చేయించేలా కృషి చేస్తున్నాను.

ప్రశ్న : చింతలపూడి నగర పంచాయతీలో సెంట్రల్ లైటింగ్ ఎప్పటికి పూర్తవుతుంది? నగర పంచాయతీ ఎన్నికలు జరుగుతాయా? నగర పంచాయతీ కావడంతో ఎన్‌ఆర్‌ఇజిఎస్ పనులు చూపడం లేదుగా?

ఎంఎల్‌ఎ: చింతలపూడి నగర పంచాయతీ భవనాల పనులు రూ.30 లక్షలతో వేగవంతంగా సాగుతున్నాయి. కొంత దాతలు, కొంత సొంత నిధులతో చేపట్టిన ఈ పనులు త్వరలో పూర్తవుతాయి. అదే విధంగా నగర పంచాయతీ ఎన్నికలపై నేతలు, పెద్దలతో చర్చలు సాగుతున్నాయి. త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటాం.

ప్రశ్న : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మిగిలిన భవనాలు ఎప్పటికి పూర్తవుతాయి? నియోజకవర్గంలోని హాస్టళ్ల అభివృద్ధికి నిధులు ఏమైనా వచ్చాయా?

ఎంఎల్‌ఎ: డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల మిగిలిన భవనాల నిర్మాణం పూర్తికి నిధుల కోసం కృషి చేస్తున్నాను. హాస్టళ్ల అభివృద్ధికి రూ.రెండున్నర కోట్లు ఖర్చు పెడుతున్నాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాను.

ప్రశ్న: చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధిపై ఇంకా ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా?

ఎంఎల్‌ఎ: గత పాలకులు పట్టించుకోకపోవడం వల్ల నియోజకవర్గంలో వసతుల లేమి తీవ్రంగా ఉంది. రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాల మెరుగుకు కృషి చేస్తున్నాను. సంవత్సర కాలంలో రోడ్లు మొత్తం పూర్తి కావాలని కంకణం కట్టుకున్నాను. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాను.

ప్రశ్న: మిషన్ హోప్ నుంచి ఎంఎల్‌ఎ వరకూ మీ ప్రస్థానం ఎలా ఉంది?

ఎంఎల్‌ఎ: మిషన్ హోప్ సంస్థ వల్ల కొంతమందికి సేవ చేయగలిగాను. ఎంఎల్‌ఎగా అందరికీ సేవ చేసే అవకాశం వచ్చింది. బాధ్యత పెరిగింది. చింతలపూడి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలనేది నా లక్ష్యం. దీనికి ప్రజలు, కార్యకర్తలు, నేతల సహకారం కావాలి.

ప్రశ్న: ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు అమలవుతోంది. దీనిపై మీ స్పందన?

ఎంఎల్‌ఎ : సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా మహిళలకు స్త్రీశక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం మంచి పరిణామం. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి, వారి కాళ్లపై వారు నిలబడటానికి ఇది ఉపయోగపడుతుంది. కూటమి ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది.

ప్రశ్న: చింతలపూడి ఎస్‌సి రిజర్వుడు నియోజకవర్గం అయినప్పటి నుంచి ఎన్నికైన ఎంఎల్‌ఎలను కొంతమంది నాయకులు ఇబ్బందులు పెడుతున్నారనే ప్రచారం ఉంది. మీకు అలాంటి అనుభవాలు ఏమైనా ఎదురయ్యాయా?

ఎంఎల్‌ఎ: రిజర్వుడు నియోజకవర్గంలోనే ఇలాంటి అలజడులు సృష్టించడం మంచి పద్ధతి కాదు. అయినా నాయకులు, కార్యకర్తలు, ప్రజలకే నా మొదటి ప్రాధాన్యత. నా దృష్టి అంతా నియోజకవర్గ అభివృద్ధిపై మాత్రమే ఉంది.

ప్రశ్న: ఈ మధ్య కాలంలో సొంత పార్టీ నాయకులు కావాలని అసత్య ఆరోపణలు మీడియా ద్వారా చేయిస్తున్నారనే ప్రచారం ఉంది. దీనిపై మీ స్పందన?

ఎంఎల్‌ఎ: ఇలాంటివి నా దృష్టికి వచ్చాయి. ఆధారాలు కూడా ఉన్నాయి. వాళ్లు మారతారని చూస్తున్నాను. లేదంటే వాటిని అధిష్టానం దృష్టిలో పెడతాను. అయినా వాటి గురించి పట్టించుకునే సమయం నాకు లేదు. నేను ఒక విజన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనా విధానానికి అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధిపై మాత్రమే దృష్టి పెట్టాను. నేను చేసే అభివృద్ధి మాట్లాడుతుంది. అధిష్టానం, ప్రజలు గుర్తిస్తారు. నియోజకవర్గంలో ఒక నూతన మార్పు తీసుకొస్తాను. నాయకులు, కార్యకర్తల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాను.

ప్రశ్న: నియోజకవర్గ ప్రజలకు ఏమైనా చెప్పదలుచుకున్నారా?

ఎంఎల్‌ఎ: నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటాను, ఉండాలి. నాపై నమ్మకంతో ఎంఎల్‌ఎ టిక్కెట్ ఇచ్చిన అధిష్టానం, గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. సంవత్సర కాలంలో పలు మార్పులు చూశారు. ఇంకో సంవత్సర కాలంలో ఒక కొత్త చింతలపూడి నియోజకవర్గాన్ని చూస్తారు. ప్రజలు, కార్యకర్తలు, నాయకులు సహకారం అందించాలి.

కెప్టెన్ లక్ష్మీ సెహగల్ జీవితం గొప్ప స్ఫూర్తిదాయకమైనది. ఆ రోజుల్లోనే వైద్య విద్యను అభ్యసించారు. సుభాష్ చంద్రబోస్ ఇండియన్ నేషనల్ ఆర్మీలో రాణి ఝాన్సీ రెజిమెంట్‌కు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యానంతరం కాన్పూర్‌లో స్థిరపడి పేదసాదలకు డాక్టర్‌గా వైద్య సేవలందించారు. వామపక్షాల అభ్యర్థిగా రాష్ట్రపతి పదవికి పోటీ పడ్డ తొలి మహిళ డాక్టర్ లక్ష్మీ సెహగల్.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



రాష్ట్రంలో టాప్ 3లో ఏలూరు జిల్లాను ఉంచేలా కృషి

పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముందుకు వెళ్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం విషయంలో ఎక్కడా కూడా రాజుపడడం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తూనే మరోపక్క పోలవరం ప్రాజెక్టు, అమరావతి అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రాష్ట్రానికి పెట్టుబడులు ఆహ్వానిస్తూ, ఉద్యోగ అవకాశాలే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు, బడుగు, బలహీన తరగతుల అభ్యున్నతికి రూ.వేల కోట్ల నిధులు ఖర్చు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజునే ఐదు సంతకాలతో ప్రధాన హామీల అమలుకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం వాటిని అమల్లోకి తెచ్చిందని చెప్పారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక గత ప్రభుత్వం బకాయిలు మొత్తం చెల్లించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో 24 గంటల్లో నగదు జమ చేశామన్నారు. రైతుల కళ్లల్లో ఆనందం చూశానని చెప్పారు. దీపం-2 పథకంలో మొదటి విడతలో 97 లక్షల మందికి, రెండో విడతలో 91.10 లక్షల మందికి ఉచిత గ్యాస్ అందించామన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం నగదు చెల్లించాల్సిన అవసరం లేదని, ఇకపై డిజిటల్ వాలెట్ చెల్లింపులు ఉంటాయని తెలిపారు. పౌర సరఫరాల శాఖ పరిధిలో గ్యాస్ ఏజెన్సీల సహకారంతో దీపం-2 పథకం కింద డిజిటల్ వాలెట్ ద్వారా నగదు చెల్లింపును పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఈ వినూత్న కార్యక్రమాన్ని ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ఇకపై లబ్ధిదారులు ముందుగా సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సిలిండర్ బుకింగ్ చేసిన వెంటనే రాయితీ డబ్బును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని, లబ్ధిదారులు పంజాబ్ నేషనల్ బ్యాంక్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తన డిజిటల్ వాలెట్‌ను యాక్టివేట్ చేసుకోవాలన్నారు. సిలిండర్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్ వద్ద ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడంతో డిజిటల్ వాలెట్ ద్వారా ఏజెన్సీకి నగదు చెల్లింపు జరగుతుందని చెప్పారు. దీంతో లబ్ధిదారుడు పూర్తిగా నగదు చెల్లించకుండా ఉచితంగా సిలిండర్ పొందగలుగుతారన్నారు. పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా దీనిని విస్తరించే దిశగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించనుందని మంత్రి వెల్లడించారు.

తొలి ఏడాదిలోనే అనేక ఘన విజయాలు

గత ప్రభుత్వం రూ.పది లక్షల కోట్ల రుణ భారం మోపింది. ఏడాదికి సుమారు రూ.60 వేల కోట్ల వడ్డీ, అసలు, వాయిదాలు చెల్లించాలి. దీనికి తోడు రూ.1.40 లక్షల కోట్లు బకాయిలు ఉన్నాయి. ఈ విధంగా రాష్ట్ర ఖజానా దివాళా తీసి ఉన్న పరిస్థితుల్లో అధికారంలోకొచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 700లకు పైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు హామీలను అమలు చేసిందన్నారు. ఈ స్థాయిలో గతంలో ఏ ప్రభుత్వం హామీలు అమలు చేయలేదని తెలిపారు.

రాష్ట్రంలో టాప్ 3లో ఏలూరు జిల్లా

రాష్ట్రంలో ఏలూరు జిల్లాను టాప్ 3లో ఉంచాలని కృషి చేస్తున్నాం. జిల్లాలో సమస్యలపై దృష్టి పెట్టాం. పోలవరం నిర్వాసితులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాలో విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. త్వరగా రోడ్లు పూర్తి చేస్తాం. పంచాయతీ రోడ్లు, లింక్ రోడ్లు పూర్తి చేస్తాం. డ్రెయినేజీలు ఏర్పాటు చేస్తున్నాం. ఆగస్టు 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డు ఇస్తున్నాం. పి-4 మార్గదర్శకాలు అమలు చేస్తున్నాం. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. జిల్లాలో చదువుకున్న వారి లిస్ట్, ఇంటి ఇంటికి తిరిగి తీసుకుంటున్నాం. వారికి స్కిల్ డెవలప్‌మెంట్ చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.

నియోజకవర్గ అభివృద్ధికి ఎంఎల్‌ఏ కృషి

ఆది ధర్మారావు, సీతానగరం సొసైటీ చైర్‌పర్సన్



కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి కనిపిస్తుంది. చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ కృషి చేస్తున్నారు. రైతులకు మేలు చేసే విధంగా పాటు పడుతున్నారు. కోకో రైతుల కోసం ఫ్యాక్టరీ పెట్టేందుకు కృషి చేస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన వద్ద ప్రణాళికలు ఉన్నాయి. వాటిని అమలు చేస్తే గతంలో కంటే అభివృద్ధి ఎక్కువగా కనిపిస్తుంది. కార్యకర్తలు ఏ సమయంలో వచ్చినా అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. కష్టపడిన కార్యకర్తలకు న్యాయం జరుగుతుంది. నా విషయంలో అదే జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తాను.

ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు

ఆలపాటి దుర్గ రాంప్రసాద్, వేగవరం సొసైటీ ప్రెసిడెంట్

కూటమి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు. సూపర్ సిక్స్‌తో పేదలందరికీ లబ్ధి చేకూరింది. నాకు వేగవరం సొసైటీ ప్రెసిడెంట్‌గా పదవి ఇచ్చిన పార్టీ పెద్దలకు, ఎంఎల్‌ఎకు రుణపడి ఉంటాను. పార్టీ కోసం కృషి చేస్తాను .



టిడిపి బలోపేతానికి కృషి చేస్తా

కొడవటి వెంకటేశ్వరరావు, తాడువాయి సొసైటీ అధ్యక్షులు



ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి ప్రభుత్వం అంటేనే ప్రజల సంక్షేమ ప్రభుత్వమని తాడువాయి సొసైటీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నాకు సొసైటీ అధ్యక్షుని పదవి ఇచ్చిన పార్టీ పెద్దలకు, ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌కు, సిఎం చంద్రబాబుకు ఎంతో రుణపడి ఉంటానని చెప్పారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ ఎంతో సుఖ సంతోషాలతో ఉన్నారని తెలిపారు.

మరో అడుగు ముందుకు

(మొదటి పేజీ నుంచి)

తెలుగు నేలపై ప్రారంభమైన మొట్టమొదటి దినపత్రిక ప్రజాశక్తి. 1942లో వారపత్రికగా ప్రారంభమై 45లో దినపత్రికగా ఎదిగింది. ఈ గమనంలో అనేక ఆటుపోట్లను, ఎత్తుపల్లాలనూ అధిగమించింది. 44 ఏళ్ల క్రితం ప్రజాశక్తి దినపత్రికగా పున:ప్రారంభమై 2025 ఆగస్టు 1వ తేదీన 45వ వార్షికోత్సవం జరుపుకుంటోంది. పత్రిక ప్రారంభమైంది మొదలు పాఠకుల ఆదరణ, శ్రేయోభిలాషుల సహకారంతో అప్రతిహతంగా పురోగమిస్తోంది. ప్రజా ఉద్యమంలోనూ, పత్రికా రచనల్లోనూ సవ్యసాచిలా రాణించిన మోటూరు హనుమంతరావు సంపాదకత్వంలో, మహానేత పుచ్చలపల్లి సుందరయ్య దార్శనికతలో 1981 ఆగస్టు 1న విజయవాడ కేంద్రంగా పున:ప్రారంభమైన ప్రజాశక్తి అనతి కాలంలోనే ఉమ్మడి రాష్ట్రంలో 10 కేంద్రాలకు విస్తరించింది. నవ్యాంధ్రప్రదేశ్‌లో 8 కేంద్రాల నుండి ప్రచురితమవుతోంది. పత్రికా రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికను అందుకోవడానికి ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా పోరాటాలకు అక్షరసాయాన్ని అందిస్తూ ప్రత్యామ్నాయ జర్నలిజాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రజల సహకారం, సిబ్బంది నిబద్ధత ఆధారంగా ప్రజాశక్తి పయనం ముమ్ముందుకు సాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ నుండి విజయవాడకు తరలి వచ్చిన ప్రజాశక్తి ప్రధాన కార్యాలయం కొన్నాళ్లు అద్దెభవనంలో సాగింది. 2020 నవంబరు 6వ తేదీన రాష్ట్ర రాజధాని కేంద్రం తాడేపల్లిలో నిర్మాణం పూర్తి చేసుకున్న సొంత భవనం నుండి కార్యకలాపాలను సాగిస్తూ అప్రతిహతంగా పురోగమిస్తోంది. పత్రిక ప్రస్థానాన్ని సోదాహరణంగా పరిశీలిస్తే...

ప్రజాశక్తి ఉజ్వల పాత్ర : ఏదైనా ఒక ఉద్యమం అది స్వాతంత్ర్య పోరాటం కావచ్చు, విప్లవ కార్యాచరణ కావచ్చు. అలాంటి సమయాలలో ప్రతి దేశంలోనూ పత్రికలు విశిష్ట పాత్రను పోషించాయి. అందుకే వాటి పాత్ర గురించి లెనిన్ ఇలా అన్నారు. ' పత్రిక సమిష్టి ఆందోళన కారుడు మాత్రమే కాదు... సమిష్టి ఉద్యమ నిర్మాత కూడా'.

భారతదేశంలో అభ్యుదయ భావాలు-పత్రికలు : భారతదేశంలో సోషలిస్టు భావాల్ని ప్రచారం చేయటానికి మొట్టమొదటిగా 'సోషలిస్టు' అనే వారపత్రిక 1922 ఆగుస్టు 5న ప్రారంభమైంది. మన స్వాతంత్ర్య ఉద్యమంలో కాన్పూరు కుట్ర కసు దేశవ్యాప్తంగా పెద్ద సంచలనాన్ని రేకెత్తించింది. సరిగ్గా ఆ కాలంలోనే కమ్యూనిస్టు భావాలు దేశం నలుమూలలకూ వ్యాపించటం ప్రారంభమయింది. సోషలిస్టు భావాల వ్యాప్తికి దేశంలో రహస్యంగా ప్రచురింపబడిన పత్రికలు, పుస్తకాలతో పాటు, ఇంగ్లండ్ నుండి రహస్యంగా ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పోలీసుల కన్నుగప్పి పత్రికలు, పుస్తకాలు వచ్చేవి. ఈ సారస్వతం యువకులకూ, విద్యార్థులకూ అమృత సమానంగా ఉపకరించేవి. 1934-39 మధ్యకాలంలో మద్రాసు నుండి వెలువడిన 'న్యూఏజ్' ఆంగ్ల మాసపత్రిక దక్షిణ భారతదేశంలో, 1937లో పి.సి.జోషి సంపాదకత్వంలో బొంబాయిలో ప్రారంభించబడిన 'నేషనల్ ఫ్రంట్' వారపత్రిక కమ్యూనిస్టు ఉద్యమంతోపాటు ప్రజాసంఘాల నిర్మాణానికి కూడా ఎంతగానో తోడ్పడింది.

ఆంధ్రలో 1933 తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభమైంది. అభ్యుదయ భావాలను ప్రచారం చేసేందుకు 1937లో 'నవశక్తి' వారపత్రిక ప్రారంభించబడింది.





రెండో ప్రపంచయుద్ధం 1939లో ప్రారంభ మైంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు బ్రిటన్‌తోపాటు భారతదేశాన్ని కూడా యుద్ధంలోకి దించారు. ఆ కాలంలో బ్రిటిష్ చర్యను విమర్శించిన పత్రికలు క్రూరంగా అణచివేయ బడ్డాయి. 'నేషనల్ ఫ్రంట్' వారపత్రికతోపాటు, వివిధ భారతీయ భాషల్లో ముద్రింపబడే పత్రికలన్నీ నిషేధింప బడ్డాయి. తర్వాత వివిధ రాష్ట్రాల మధ్య సంధానకర్తగా, 'కమ్యూనిస్టు' పేరుతో ఆంగ్లంలో మాసపత్రిక ప్రచురించ బడింది. ఆకాలంలో ఎన్నో వ్యయప్రయాసల కోర్చి వివిధ భాషల్లో రహస్య పత్రికలు పరిమిత స్థాయిలోనైనా నడిచాయి. ఆంధ్రదేశంలో 'స్వతంత్ర భారత్' ఒకటి.

జాతీయ, అంతర్జాతీయ మార్పుల దృష్ట్యా 1942లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగింపబడింది. ఆంధ్రలో ప్రజాశక్తి వారపత్రిక వెలువడింది. 1945లో అది దినపత్రికగా ప్రచురించబడింది. 1948-52 మధ్యకాలంలో కమ్యూనిస్టు పార్టీ తిరిగి తీవ్ర నిర్బంధ విధానానికి గురయింది. కమ్యూనిస్టులు పనిచేసే పత్రికలను కూడా ప్రభుత్వం నిషేధించింది. నిర్బంధ కాలంలో బొంబాయి నుండి గుజరాతీ, మరాఠీ భాషల్లో 'మషాల్' పేరుతో దినపత్రికలు వెలువడ్డాయి. కొన్ని మాసాల తర్వాత అవి నిషేధించబడ్డాయి. తర్వాత 1949-51 మధ్యకాలంలో మరాఠీభాషలో 'యుగంతర్' గుజరాతీ భాషలో 'జై గుజరాత్' వారపత్రికలు వెలువడ్డాయి.

1952 తర్వాత : 1952 నుండి తిరిగి కమ్యూనిస్టు పార్టీ బహిరంగంగా పనిచేయసాగింది.. దేశవ్యాపితంగా వివిధ భాషల్లో పత్రికలు ప్రారంభించబడ్డాయి. ఆంధ్రాలో 'ప్రజాశక్తి' 'మళయాళంలో దేశాభిమాని', బెంగాల్‌లో 'స్వాధీనత' అలాంటి పత్రికలే.

ఉత్తేజకర స్మృతులు : బొంబాయి నుండి వెలువడే పత్రిక 'నేషనల్ ఫ్రంట్' ద్వితీయ ప్రపంచ సంగ్రామం ప్రారంభం కాగానే నిషేధింపబడింది. ఆ తర్వాత 'కమ్యూనిస్టు' పేరుతో ఆంగ్ల మాసపత్రిక రహస్యంగా ప్రచురించబడింది. పోలీసులు బొంబాయిలో దీనికి పెద్ద ప్రెస్ ఉండేదని భావించేవారు. కానీ ఒక చిన్న ప్రెస్ మాత్రమే ఉండేది. ఆ ప్రెస్ కోసం రెండున్నర సంవత్సరాల కాలం పోలీసులు బొంబాయి నగరమంతా గాలించారు. కానీ ప్రెస్ స్థావరం దొరకలేదు. అలా అడుగడుగునా ఆపదల్ని ఎదుర్కొంటూ ప్రాణసమానంగా ప్రెస్‌ను కాపాడుకోవాల్సి వచ్చేది. ఆ రోజుల్లో బెంగాల్, పంజాబ్, ఆంధ్ర తదితర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది యువకులు కంపోజిటర్స్‌గా ఆ ప్రెస్‌లో పనిచేశారు. ఆ రోజుల్లోనే ఆంధ్రదేశానికి చెందిన వెంకటేశ్వర రావు అనే కంపోజిటర్ రహస్య ప్రెస్‌లో పనిచేస్తూ మృతి చెందాడు. పత్రికల్లో పనిచేయటానికి, త్యాగాలు చేయటానికి ఎంతోమంది ఉత్సాహపడుతూ ఉండేవారు. ఎడిటర్లు, వర్కర్లు అందరూ పూర్తికాలం అదే పనిగా ఉన్న వారే. అదేవిధంగా వేతనాలలో కూడా వ్యత్యాసాలు ఉండేవి కావు. ప్రతి ఒక్కరికీ రు.25లు వేతనం ఇవ్వబడేది. కుటుంబం ఉన్నవారికి మాత్రం అదనంగా రు.30 లు అలవెన్సు ఇవ్వబడేది. ప్రెస్‌లో పనిచేసేవారిలో పెక్కుమంది బ్రహ్మచారులుగా ఉండేవారు. పని ఒత్తిడిగా ఉండటం వల్ల ఆ రోజుల్లో రెండు షిఫ్టులు నిర్వహింపబడేవి. అవసరం అయినప్పుడు సిబ్బంది రోజుకు 20 గంటలు పనిచేసేవారు.

ప్రెస్‌పై దాడి - వీరోచిత ప్రతిఘటన : 1945 జనవరిలో బొంబాయిలో కాంగ్రెస్‌వారు జనాన్ని రెచ్చగొట్టి పత్రిక ప్రెస్‌పై దాడి చేయించారు. ప్రెస్‌లోని ప్రతి ఒక్క కార్మికుడూ వీరోచితంగా నిలబడి ప్రతిఘటించారు. దాడిచేసిన మూక వందరెట్లు ఉన్నా కార్మికులు చలించలేదు. తరిమితరిమి కొట్టారు. దాదాపు కార్మికులందరికీ ఆ ప్రతిఘటనలో దెబ్బలు తగిలాయి. అయినా నిలబడి ఎదుర్కొన్నారు. దుండగుల దాడిలో అచ్చుయంత్రం దెబ్బతిన్నది. న్యూస్‌ప్రింట్ కాల్చివేయబడింది. అయినా పత్రిక ఆగిపోలేదు. మరో ప్రెస్‌లో రాత్రింబవళ్లు పనిచేసి రెండు వారాలపాటు పార్టీ పత్రికలు ముద్రింపబడ్డాయి. అటు తర్వాత కూడా కాంగ్రెస్‌వాదులు పెక్కుసార్లు ప్రెస్‌పై దాడిచేశారు. ఒకసారి బాంబు కూడా విసిరారు. 1950లో ప్రజాశక్తి మేనేజర్ నాగులపల్లి కోటేశ్వరరావును అరెస్టుచేసి రాజమండ్రివద్ద కాల్చి చంపారు.

ఆంధ్రలో పత్రికలు : ఆంధ్రలో ప్రచురించబడిన అభ్యుదయ, కమ్యూనిస్టు పత్రికలకు కూడా ఉజ్వల చరిత్ర ఉంది. ఎన్నో నిర్బంధాలు... ఎన్నో ఆటుపోట్లు.. ఎంతో దమనకాండ.. వాటన్నింటినీ త్యాగదీక్షతో.. ఆశయబలంతో ఎదుర్కొని ఇక్కడ కూడా పత్రికలు ప్రచురించాల్సి వచ్చింది. ఉప్పు సత్యాగ్రహం అనంతరం అనేకమంది యువకులు, టెర్రరిస్టు భావాలుగల వారు సోషలిజం వైపుకు ఆకర్షింపబడ్డారు. తత్ఫలితంగా కొన్ని పత్రికలు వామపక్ష రాజకీయాలతోపాటు, సోషలిస్టు భావాలను అవి స్పష్టంగా ప్రచారం చేయనారంభించాయి. 1935 ప్రాంతంలో 'ప్రభ' అనే పక్షపత్రిక అతివాద భావాలను, కొంతవరకు సోషలిస్టు భావాలను వ్యాప్తిలోకి తెచ్చింది.

'నవశక్తి' : అయితే... సోషలిస్టు పత్రికగా ఆంధ్రదేశంలో మొట్టమొదటిసారిగా ప్రచురింపబడిన పత్రిక 'నవశక్తి'. 1937, డిసెంబర్ 15న రాజమండ్రి నుండి ఆ తర్వాత విజయవాడ నుండి నడపబడింది. ఆ కాలంలో కమ్యూనిస్టు పార్టీ నిషేధంలో ఉంది. కొన్నాళ్లు రాజమండ్రి నుండి నడిచిన నవశక్తి ఆ తర్వాత విజయవాడ నుండి వెలువడింది.

నవశక్తి త్రిపుర కాంగ్రెస్ సంచిక భారత జాతీయోద్యమాన్ని మార్క్సిస్టు దృక్పథంతో సింహావలోకనం చేసింది. అలాగే రష్యన్ సంచిక సోవియట్ విజయాలను వివిధ వ్యాసాలలో వివరించింది. పై రెండు ప్రత్యేక సంచికలు దేశభక్తుల్ని ఎంతగానో ఆకర్షించి, వారు కమ్యూనిజంవైపు మొగ్గటానికి తోడ్పడినాయి. రెండో ప్రపంచయుద్ధం ఆరంభం కాగానే నిర్బంధ విధానం తీవ్రమైంది. దాన్ని ముందుగానే పసికట్టి పత్రికకు సంబంధించిన ప్రెస్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా ముందే జాగ్రత్తలు తీసుకొని నాయకులతో పాటు సంపాదకులు కూడా అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు.

రహస్య పత్రికగా 'స్వతంత్ర భారత్' : 1939-42 మధ్యకాలంలో 'స్వతంత్ర భారత్' అనే పత్రిక రహస్యంగా ప్రచురించబడింది. ఆ పత్రిక దగ్గర ఉంటే జైలుశిక్ష పడే రోజులవి. అయినా అనేకమంది ఆ పత్రికను చదివేవారు.

ప్రజాశక్తి వారపత్రిక : 1942 జూన్‌లో కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగింప బడటంతో నాయకులు చాలామంది అజ్ఞాతవాసం నుండి, జైళ్ల నుండి బయటకి వచ్చారు. ఆ స్థితిలో 1942, జూన్ 17న ప్రజాశక్తి వారపత్రికగా అవతరించింది. అధికార రీత్యా కమ్యూనిస్టు పత్రికగా పేర్కొనబడిన మొదటిపత్రిక ప్రజాశక్తి. ఆ విధంగా రెండున్నర సంవత్సరాలపాటు వారపత్రికగా ప్రజాశక్తి నడిచింది.

దినపత్రికగా ప్రజాశక్తి : కమ్యూనిస్టులు పనిచేసే దినపత్రిక ప్రచు రణకు ప్రభుత్వ అనుమతి పొందాలంటే చాలా కష్టమైన పని. దానికితోడు దినపత్రికకు అవసరమైన సిబ్బందిని, యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవటానికి తగిన వనరులు, డబ్బు కూడా అవసరం. దినపత్రిక నిధికి పిలుపు ఇవ్వగానే సామాన్య ప్రజలు, పార్టీ అభిమానులెందరో విరాళాలందించారు. అభ్యుదయ యువకవులు సంపాదకవర్గంలో పనిచేయటానికి తమ సంసిద్ధత వెల్లడించారు. ప్రఖ్యాత చిత్రకారుడు, కవి, నవలాకారుడు అయిన అడవి బాపిరాజు ఉత్తేజితుడై తనంతతానుగా ప్రజాశక్తి ముఖచిత్రానికి అక్షరాలు రాసి పంపారు. 1945 డిసెంబర్ 3న ప్రజాశక్తి దినపత్రిక తొలి సంచిక విజయవాడ నుంచి వెలువడింది. ఆ విధంగా తెలుగునాట శ్రామికుల వాణిగా, అభ్యుదయ భావాల పతాకంగా ఉంది. ఆధునిక సౌకర్యాలు లేని ఆనాడు, విజయవాడలో దినపత్రిక నడపాలంటే అంత సులువైన పనికాదు. సంపాదకవర్గంలో చేరిన వారెవరికీ దినపత్రికలో అంతకుముందు పనిచేసిన అనుభవం లేదు. దీక్ష, ఉత్సాహమే వారికున్న పెట్టుబడి. వివిధ ప్రజా ఉద్యమాల్లో పనిచేసే కార్యకర్తలే ఎక్కడికక్కడ పత్రికా విలేకరులుగా పనిచేసేవారు. ప్రజలిచ్చిన విరాళాలతో, కాట్రగడ్డ సోదరుల తోడ్పాటుతో మొగల్‌రాజపురంలో 'ప్రజాశక్తి నగర్' వెలిసింది. అక్కడే పత్రికలో పనిచేసేవారు కాపురాలుండేవారు. అభిమానులకు ప్రజాశక్తినగర్ యాత్రాస్థలంగా ఉండేది. ఎన్ని ఇబ్బందులెదుర్కోవాల్సి వచ్చినా ప్రజాశక్తి తెలుగు పత్రికా ప్రపంచంలో విశిష్ట స్థానాన్ని పొందగలిగింది. 1948లో కమ్యూనిస్టు ఉద్యమంపై నిర్బంధకాండ ప్రారంభమైంది. పత్రికా కార్యాలయంపై పలుమార్లు పోలీసుదాడులు జరిగాయి. చివరికి నిర్బంధకాండ తీవ్రతరమైంది. పత్రిక ముద్రణాలయాన్ని, ప్రచురణల్ని, గ్రంథాలను పోలీసులు దాడిచేసి నాశనం చేశారు. ఆ విధంగా 1948 ఏప్రిల్ 22 తేదీలో ప్రజాశక్తి మూతపడ్డది.

రహస్య కాలంలో పత్రికలు : ప్రభుత్వ క్రూర నిర్బంధకాండలో... పాశవిక దాడుల్లో చాలామంది నాయకులు జైళ్లలో మగ్గవలసి వచ్చింది. వేలాదిమంది కాల్చివేయబడ్డారు. చిత్రహింసలకు గురిచేయబడ్డారు. అలాంటి పరిస్థితుల్లో పార్టీ సందేశాన్ని ప్రజలకు వేర్వేరు రూపాల్లో అందించటానికి కొన్ని పత్రికలు కృషిచేశాయి. జనత, సందేశం, జనవాణి పత్రికలు అలా నడుపబడ్డాయి.

తిరిగి ప్రజాశక్తి ప్రచురణ : 1951 ఆగస్టు నుండి నిర్బంధకాండ కొంతవరకు సడలింది. ప్రధాన నాయకులంతా ఇంకా జైలులోనూ, అజ్ఞాతవాసంలోనూ ఉండగానే 1951 నవంబర్ 21వ తేదీ నుండి ప్రజాశక్తి వారపత్రిగా వెలువడటం ప్రారంభమైంది. 1952 జనరల్ ఎన్నికల సందర్భంగా ద్వైవారపత్రికగా వెలువ డింది.

'విశాలాంధ్ర' ప్రారంభం : ఎన్నికల అనంతరం కమ్యూనిస్టు ముఖ్య నాయకులంతా బహిరంగంగా రావటంతో తిరిగి దినపత్రిక ప్రచురించాలని, ఆంధ్ర రాష్ట్రాన్నే గాక విశాలాంధ్రను కూడా సాధించాలనే లక్ష్యంతో దినపత్రికకు 'విశాలాంధ్ర' పేరు పెట్టారు ఆ విధంగా 1952 జూన్ 22న దినపత్రిక అవతరించింది.

మరో మజిలి - జనశక్తి దినపత్రిక : జైలు నుండి నాయకులంతా బయటికి వచ్చిన తర్వాత రానున్న జనరల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జనశక్తిని దినపత్రికగా తీసుకురావాలని నిర్ణయించారు. ఆ విధంగా 1966 సెప్టెంబర్ ఒకటిన జనశక్తి దినపత్రికగా ప్రచురణ ప్రారంభమైంది.

ప్రజాశక్తి పునర్వికాసం : తరువాత1968 జులై 28న 'ప్రజాశక్తి' వారపత్రికగా పునరుద్ధరింపబడింది. 13 సంవత్సరాలపాటు ప్రజాశక్తి వారపత్రికగా, ద్వైవారపత్రికగా, ఎన్నికల సందర్భంలో దినపత్రికగా వెలువడింది. 1981 ఆగస్టు ఒకటి నుండి ప్రజాశక్తి దినపత్రికగా అప్రతిహత పయనం సాగిస్తోంది.

వైసిపి హయాంలో రాష్ట్రం విధ్వంసం

ఘంటా మురళీకృష్ణ, మాజీ ఎంఎల్ఎ



ప్రజాశక్తి - చింతలపూడి

గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం విధ్వంసమైంది. అభివృద్ధిలో 20 ఏళ్ల వెనక్కి వెళ్లింది. ఎక్కడ చూసినా రోడ్లన్నీ గోతులమయం. ఇది వైసిపి గత ఐదేళ్ల పాలన. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నరేంద్ర మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తూనే రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించారు. సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడా రాజీ పడకుండా అమలు చేస్తూ రాజధాని నిర్మాణం, అమరావతి అభివృద్ధి, రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే విధంగా రాత్రి, పగలు నిద్ర లేకుండా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారు. విద్యాశాఖలో పెను మార్పులు తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించే విధంగా నారా లోకేష్ కృషి చేస్తున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే యువతకు ఉపాధి దొరుకుతుంది. రోడ్లు ఇరిగేషన్ పనులపై ప్రభుత్వం దృష్టి సారించింది. మామిడి, పొగాకు, మొక్కజొన్న, వరి పంట, మిర్చి పంటలకు ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుంది. వైద్యరంగంలో ప్రభుత్వం ఎక్కడా కూడా రాజీ పడడం లేదు. ఈనెల 15 నుంచి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పిస్తుంది. వృద్ధులకు పెన్షన్లు రూ.3 వేల నుంచి 4 వేల వరకూ పెంచారు. డయాలసిస్ రోగులకు రూ.10 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తుంది. తల్లికి వందనం ప్రభుత్వానికి ఎంత భారమైన ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం నగదు జమ చేశారు.

నియోజకవర్గంలో ఎంఎల్ఎ సొంగా రోషన్ చంద్రబాబునాయుడులో విజన్, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ఆలోచనలతో అభివృద్ధిలో దూకుడు స్వభావంతో ముందుకు వెళుతున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో రోడ్లకు రూ.25 కోట్లు మంజూరు చేయించారు. అభివృద్ధి కోసం పట్టుదలతో నిధులు మంజూరు చేయించుకుంటూ ముందుకు వెళ్తున్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం కష్టపడుతున్నారు. ఇటు ఎంపీ, మంత్రి పార్థసారథి సహకారం, ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యాన చింతలపూడి నియోజకవర్గానికి నిధులు తీసుకువస్తున్నారు. ఎంఎస్ఎంఇ పార్కు 70 ఎకరాల్లో ఏర్పాటు చేయడం పూర్తిగా ఈ ఘనత ఎంఎల్ఎ రోషన్ కుమార్‌కి దక్కుతుంది. చింతలపూడి ఎత్తిపోతల రైతులకు న్యాయం జరుగుతుంది. చింతలపూడి ఎత్తిపోతల పనులు మొదలుపెట్టడానికి ప్రభుత్వం కొంత నగదును మంజూరు చేశారు. కానీ అది కోర్టులో ఉండడం వల్ల కొంత ఆలస్యం అవుతుంది. దీనికోసం సుప్రీంకోర్టులో వేసి ప్రత్యేకంగా లాయర్లు నియమించారు. త్వరలో అది కూడా పూర్తవుతుంది. ఫేజ్ వన్ ఫేజ్ టు పూర్తి అయితే మెట్ట ప్రాంతంపోయి రైతులందరూ రెండు పంటలు సమృద్ధిగా పండించుకుంటారు. వంద పడకల హాస్పటల్ త్వరగా పూర్తిచేయాలని ఎంఎల్ఎ దానిపైన దృష్టిపెట్టారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడానికి నిధులు మంజూరు చేయించారు. విజనున్న నాయకుడికి విజన్ ఉన్న ఎంఎల్ఎ వచ్చారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ఢిల్లీలో ఏదో సమస్య మీద మాట్లాడుతూ నిధులు తీసుకువస్తున్నారు. రైతుల సమస్యపై మాట్లాడుతూ పరిష్కారం చేస్తున్నారు.

ఏడాదికాలంలో ఎన్నో అభివృద్ధి పనులు

చీదరాల మధుబాబు, జనసేన మండల అధ్యక్షులు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. గత ప్రభుత్వంలో అభివృద్ధి 25 సంవత్సరాలు వెనక్కి వెళ్లింది. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎల్ఎ సొంగ రోషన్‌కుమార్ ఆధ్వర్యాన నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు వెళ్తుంది. ఒక పక్క విజన్‌తో, ప్రజలకు నాయ్యం చేయాలనే లక్ష్యంతో వచ్చారు. చింతలపూడి నియోజకవర్గం అభివృద్ధికి ప్రణాళికలు వేశారు. ప్రణాళికలకు అనుకూలంగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నారు. ఆయన ప్రణాళికలు మొత్తం అమలు జరిగితే చింతలపూడి నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబడుతుంది. నియోజకవర్గంలో రైతుల కోసం కోకో ఫ్యాక్టరీ, విద్యార్థుల కోసం పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు కూటమి ప్రభుత్వం పింఛన్లను పెద్ద మొత్తంలో పెంచి అండగా నిలిచింది. కులాలకతీతంగా పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారు. అయినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పార్టీలకు



అతీతంగా వృద్ధులకు, వితంతువులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, తల సేమియా, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, సంపూర్ణ వికలాంగులకు రూ.15 వేల పెన్షన్లు ప్రతి నెల ఒకటవ తేదీనే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అధికారులు అందజేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఇప్పటికే సూపర్ సిక్స్ హామీల్లో నాలుగు హామీలు అమలు చేశామని, తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు ఉన్నా వారందరికీ తల్లి అకౌంట్లో డబ్బులు జమ అయ్యాయన్నారు. ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతి రైతు అకౌంట్లో రూ.20 వేలకు గాను రూ.7 వేలు జమ చేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు.

జనసేనకు ప్రాధాన్యత

కూటమి ప్రభుత్వంలో జనసేనకు సముచిత స్థానం ఇస్తున్నారు. జనసేన కార్యకర్తలకు అన్ని కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు. పార్టీ పదవులలో కూడా సముచిత స్థానం కల్పిస్తారని కోరుకుంటున్నాం.

జన, కుల గణనలో కీలకాంశాలు

న్యాయం కోసం జరిపే పోరాటంలో కుల సమాచారం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. అసమానతల నిజ స్వభావాన్ని బహిర్గతం చేయడానికి, ప్రస్తుత విధానాల వైఫల్యాన్ని బయటపెట్టడానికి, కుల ఆధారిత రాజకీయాలను ఎండగట్టడానికి ఇది సాయపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరిస్తే కులాలకు అతీతంగా నిర్మాణాత్మక మార్పుల కోసం పోరాడే విస్తృత ఉద్యమం ఊపిరి పోసుకుంటుంది. నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, గృహ నిర్మాణం, భూసంస్కరణలు, ఉపాధి హామీలు, ప్రభుత్వ సేవల కల్పనలో సార్వత్రిక ప్రవేశం లభిస్తుంది.

సుదీర్ఘ జాప్యం, అనిశ్చితి అనంతరం ఎట్టకేలకు 2027లో జాతీయ జనాభా లెక్కల సేకరణ కోసం భారత రిజిస్ట్రార్ జనరల్ నోటిఫికేషన్ జారీ చేశారు. రాబోయే ఈ జనగణనలో ప్రధాన మార్పు ఏమిటంటే కులగణనను చేర్చాలని నిర్ణయించడం. కులగణనను అధికార బిజెపి, దాని సైద్ధాంతిక మాతృసంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) చాలా కాలంగా వ్యతిరేకిస్తున్నాయి. సామాజిక న్యాయం కోసమే ఈ చర్య తీసుకోవడం జరిగిందని ఇప్పుడు బిజెపి ప్రతినిధి చెబుతున్నప్పటికీ ఈ నిర్ణయం వెనుక సూత్రబద్ధమైన నిబద్ధత కంటే రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని అర్థమవుతోంది.

కోవిడ్-19 మహమ్మారి కారణంగా జనాభా లెక్కల సేకరణ ఆలస్యమైనప్పటికీ ఆ తర్వాత దానిని చేపట్టడంలో బిజెపి పెద్దగా ఆసక్తి

> కుల సమాచారం ఉపయుక్తమైనదే అయినప్పటికీ అది అన్నింటికీ మందు కాదు. కుల సమాచారం అందుబాటులో ఉన్నచోట కూడా ఎస్సీ, ఎస్టీలలో అసమానతలు వేళ్లూనుకుపోయి ఉన్నాయి. కేవలం కులగణన ద్వారా న్యాయం చేకూరదు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడడంలో మన నిబద్ధతను అనవసరమైన భ్రమలు బలహీనపరుస్తాయి. ముఖ్యంగా మోడీ ప్రభుత్వ హయాంలో నయా ఉదారవాద విధానాలు సంక్షేమ కార్యక్రమాలను బలహీనపరిచాయి. ప్రైవేటీకరణను ప్రోత్సహించాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాయి. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన పథకాలను నీరుకార్చాయి. ఈ వ్యవస్థీకృత సమస్యలను సవాలు చేయని పక్షంలో కులగణన మాత్రమే పేదలు, అణగారిన వర్గాల జీవితాలను మార్చదు.

చూపలేదు. బహుశా నియోజకవర్గాల పునర్విభజనను త్వరగా జరపాలని భావించి ఉండవచ్చు. రాజ్యాంగం ప్రకారం 2026 తర్వాత చేపట్టే తొలి జనగణన ఆధారంగా పునర్విభజన ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. 2026కు ముందు జనాభా లెక్కల సేకరణ జరిపితే పునర్విభజనను చేపట్టడం సాధ్యపడదు. ఇప్పుడు 2027లో జనగణన జరపాలని నిర్ణయించినందున వెంటనే పునర్విభజన కసరత్తుకు శ్రీకారం చుట్టబోతున్నారు.

కులగణన చేపట్టాలన్న డిమాండ్లను బిజెపి నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉంది. కులాల వారీగా లెక్కల సేకరణను వ్యతిరేకించాలని తాము విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్లు 2021లో లోక్‌సభకు కేంద్రం తెలియజేసింది. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కూడా ఇదే వైఖరిని పునరుద్ఘాటించింది. ప్రధానమంత్రి స్వయంగా లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023లో చేసిన ప్రసంగంలో కుల విభజనను తక్కువ చేసి మాట్లాడారు. భారతదేశంలో కేవలం నాలుగు కులాలు...మహిళలు, యువత, రైతులు, పేదలు...మాత్రమే ఉన్నాయని ఆయన ప్రకటించారు.

కులగణన విషయంలో బిజెపి దీర్ఘకాలిక వ్యతిరేకత దాని భావజాలంలోనే ఉంది. కులగణనను సంఘ్‌పరివార్ ఎప్పుడూ అనుమానంగానే చూస్తోంది. అది హిందూ సమాజంలోని తీవ్ర అసమానతలను బయటపెడుతుందని, తాము హిందూత్వ ద్వారా కోరుకున్న ఐక్యతను దెబ్బతీస్తుందని భయపడింది. అయితే వాస్తవానికి కుల గణాంకాలు అట్టడుగు వర్గాల స్వరాన్ని పెంచుతాయని, వనరులను మరింత సమానంగా పంపిణీ చేయాలని ఆ వర్గాలు డిమాండ్ చేస్తాయని, బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ మత సమీకరణ వ్యూహాన్ని సవాలు చేస్తాయని సంఘ్‌పరివార్ ఆందోళన చెందుతోంది.

రాజకీయ యూటర్న్

అయినప్పటికీ బిజెపి తన వైఖరిని మార్చుకుంది. 2024 ఎన్నికలలో ఎదురైన పరాజయాలు, ఓబీసీ ఓటర్లలో పడిపోతున్న మద్దతును దృష్టిలో పెట్టుకొని 2027 జనగణనలో కులాల వారీ సమాచారాన్ని సేకరిస్తామని ప్రకటించింది. ఇది రాజకీయ ప్రేరేపిత మార్పుగా కన్పిస్తోంది. కులగణనను ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేస్తున్నాయని విమర్శిస్తున్న బిజెపి, వారి ప్రభావాన్ని తటస్థం చేసేందుకు వాటి డిమాండ్‌నే అందిపుచ్చుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ సైతం సానుకూల వైఖరి ప్రదర్శించింది. ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగించనంత వరకూ కులాల సమాచారాన్ని సంక్షేమ ప్రయోజనాల కోసం వాడుకోవచ్చునని ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన ప్రముఖ ప్రతినిధి ఒకరు తెలిపారు.

చాలా కాలంగా కుల ఆధారిత సమాచారం అందుబాటులో లేకపోవడానికి కాంగ్రెస్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆ పార్టీ కులగణనను నిర్వహించలేదు లేదా మండల్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయలేదు. 2011లో సామాజిక-ఆర్థిక కులగణన (ఎస్.ఇ.సి.సి)ను చేపట్టింది కానీ దానిని ఉద్దేశపూర్వకంగానే సార్వత్రిక గణన నుండి వేరుచేసింది. ఆ తర్వాత కచ్చితత్వం లోపించిందంటూ కులగణనను పక్కన పెట్టింది. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఎస్.ఇ.సి.సి డేటాను పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో ఈ ప్రక్రియ కోసం ఖర్చు చేసిన రూ.5,000 కోట్ల ప్రజాధనం వృథా అయింది.

భారతదేశంలో కులగణనకు సుదీర్ఘమైన, విభిన్నమైన చరిత్ర ఉంది. 1881 నుండి 1941 వరకూ జనాభా లెక్కల సేకరణలో కులాల సమాచారాన్ని కూడా తీసుకునే వారు. స్వాతంత్ర్యానంతరం దీనికి స్వస్తి చెప్పారు. ఇకపై జనాభా లెక్కల సేకరణలో కుల ప్రస్తావన ఉండబోదని 1950లో వల్లభ్‌భాయ్ పటేల్ ప్రకటించారు. కుల సమాచార సేకరణను తిరిగి ప్రారంభించాలని 1953లో కాకా కాలేల్కర్ నేతృత్వంలోని వెనుకబడిన తరగతుల మొదటి కమిషన్, ఆ తర్వాత 1980లో మండల్ కమిషన్ ప్రభుత్వాన్ని కోరాయి.



కచ్చితమైన సంఖ్య లేనిపక్షంలో రిజర్వేషన్లు, సంక్షేమ విధానాలు లోపభూయిష్టంగా ఉంటాయిని వాదించాయి. అయినప్పటికీ ఆ తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఈ సిఫార్సులను పట్టించుకోలేదు. రాబోయే జనగణనలో కులాల సమాచారాన్ని సేకరించాలని 2021లో వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ మరోసారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

జాతీయ స్థాయిలో కులాల సమాచారం లేకపోవడంతో అనేక రాష్ట్రాలు సొంతగా కుల సర్వేలు ప్రారంభించాయి. స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారి 1968లో కేరళలో ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం సమగ్ర, శాస్త్రీయ పద్ధతిలో కుల వివరాల సేకరణ కోసం కులాలు, వర్గాలపై సామాజిక-ఆర్థిక సర్వే చేపట్టింది. రాష్ట్ర జనాభాలో ఓబీసీలు, అత్యంత వెనుకబడిన తరగతుల వారు 63 శాతానికి పైగా ఉన్నారని 2023లో బీహార్‌లో నిర్వహించిన కుల సర్వే తేల్చింది. దీంతో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం 50 నుండి 65 శాతానికి పెంచింది. అయితే కోర్టు వివాదం కారణంగా దాని అమలు ఆగిపోయింది. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం 2024లో కుల సర్వే నిర్వహించి విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లును ఆమోదించింది. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూలులో చేర్చడం కోసం దానిని పంపింది. కర్ణాటక సైతం తన సామాజిక-ఆర్థిక, విద్యా సర్వే ద్వారా చర్యలు చేపట్టింది. అయితే రాజకీయ అనిశ్చితులు, డేటా చెల్లుబాటుపై ఆందోళనల నేపథ్యంలో ఆ నివేదికను ఇంకా ప్రచురించలేదు.

రాష్ట్రాలవారీగా జరిగిన కుల సర్వేలు, వివిధ వర్గాల నుంచి పెరుగుతున్న డిమాండ్లు, వాటి తక్షణ రాజకీయ ప్రయోజనాల రీత్యా కులాల వారీగా లెక్కలు సేకరించడానికి బిజెపి అంగీకరించాల్సి వచ్చింది.

2027 జనగణన రెండు దశలుగా జరుగుతుంది. 2026 అక్టోబరులో ప్రారంభమయ్యే తొలి దశలో మంచు కురిసే ప్రాంతాలలో జనగణన చేపడతారు. 2027 మార్చి 1న రెండో దశ ప్రారంభమవుతుంది. దీనిలో దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనాభా లెక్కలను సేకరిస్తారు. జనగణనలో రెండు భాగాలు ఉంటాయి. మొదటిది గృహాలను లెక్కించడం, గృహాల గణన. ఆ తర్వాత జనాభా లెక్కలు సేకరిస్తారు. మొదటిసారిగా జనగణనను పూర్తిగా డిజిటలీకరణ చేస్తున్నారు. మొబైల్ యాప్స్, స్వీయ గణన, రియల్-టైమ్ పర్యవేక్షణను అందులో చేరుస్తారు. జనాభా లెక్కల సేకరణ దశలో కుల సమాచారాన్ని తీసుకుంటారు. గణన పూర్తయిన పది రోజులలో ప్రాథమిక సమాచారాన్ని విడుదల చేస్తారు. అనంతరం ఆరు నెలలలో సవివరమైన విభజన డేటా విడుదలవుతుంది. ఈ కాలక్రమాన్ని పాటించినట్లయితే మొత్తం పునర్విభజన ప్రక్రియను 2029 ఎన్నికల లోగానే పూర్తి చేయవచ్చు. అయితే తన తక్షణ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ మొత్తం ప్రక్రియను బిజెపి మార్చే అవకాశం కూడా ఉంది.

రాజకీయ చిక్కుముడులు, సవాళ్లు

జనగణనలో కులాన్ని చేర్చడం వల్ల వివిధ కులాల సంఖ్య, వాటి సామాజిక ఆర్థిక స్థితిగతులకు సంబంధించి విశ్వసనీయమైన సమాచారం లభిస్తుంది. రిజర్వేషన్ల పెంపు, ఓబీసీల ఉప-వర్గీకరణ, రిజర్వేషన్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 50 శాతం పరిమితి తొలగింపు డిమాండ్లను బలపరచడానికి ఇది దోహదపడవచ్చు. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన (ఇ.డబ్ల్యు.ఎస్) వారికి పది శాతం కోటా వెనుక ఉన్న హేతుబద్ధతను ధృవీకరించడానికి లేదా తిరస్కరించడానికి కూడా ఈ డేటా ఉపకరిస్తుంది. ఓబీసీల క్రీమీలేయర్ ప్రమాణాలను పరిశీలించవచ్చు. ఈ డేటా కొత్త సమాచారాన్ని వెల్లడిస్తే ఎస్సీలకు కూడా విస్తరింపజేయాలన్న డిమాండ్ ఊపందు కోవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రైవేటు రంగానికి దీనిని విస్తరించాలనే అభిప్రాయం కులగణనతో బలపడుతుంది. విశ్వసనీయ కుల సమాచారం అందుబాటులో ఉన్న పక్షంలో న్యాయస్థానాలు విధానపరమైన ప్రాతిపదికన కాకుండా మెరిట్ ఆధారంగా తీర్పు చెప్పాల్సి వస్తుంది.

అయితే అనేక సవాళ్లు కూడా ఎదురవుతాయి. వివిధ ప్రాంతాలు, భాషలు, పేర్లకు సంబంధించిన సంప్రదాయాలలో వేలాది కులాలు, ఉప కులాల సమా చారాన్ని సేకరించడం ఒక గొప్ప పని. ప్రామాణికమైన వర్గీకరణ వ్యవస్థ లేకుం డా సమాచారాన్ని సేకరిస్తే అది అస్థిరంగా, నిరుపయోగంగా ఉంటుంది. అధి కంగా లెక్కించడం, తక్కువగా లెక్కించడం, తప్పుడు వర్గీకరణకు సంబం ధించిన సవాళ్లు కూడా ఉంటాయి. జనగణన రిజర్వేషన్లతో పాటు ఇతర ముఖ్యమైన రాజకీయ అంశాలను కూడా ప్రభావితం చేస్తుంది. ప్రధానంగా ఆందోళన కలిగించే అంశం నియోజకవర్గాల పునర్విభజన. 1976 నుండి ఈ ప్రక్రియ జరగడం లేదు. అయితే 2026 జనగణన

..10లో

అభివృద్ధి పథంలో రాష్ట్రం ముమ్ముందుకు

దాసరి శ్యామ్ చంద్రశేషు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధిలో ముందుకు సాగిపోతోంది. రాష్ట్రంలో పెన్షన్లు రూ.4,000, రూ.6,000, రూ.10,000, ఇచ్చిన ఘనత ప్రభుత్వానికే చెందుతుంది. దేశంలో ఎక్కడా ఇలా పింఛను ఇచ్చిన దాఖలు లేవు. పింఛను కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు 65 లక్షల మందికి రూ.36 కోట్లు ఖర్చు పెడుతోంది. తల్లికి వందనం ఎంత మంది ఉంటే అంత మందికి ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే చేస్తోంది. స్త్రీ శక్తి ద్వారా మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసే కల్పించింది. రైతులకు 24 గంటల్లో ధాన్యం సొమ్ము జమచేసింది. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ 70 ఎకరాల్లో చింతలపూడి మండలం పట్టాయిగూడెంలో పరిశ్రమ ఏర్పాటు చేయడం జరుగుతుంది. చింతలపూడి రేచర్ల రోడ్డు త్వరగా పూర్తి చేస్తున్నారు. రూ.27 కోట్లతో ఎన్ఆర్ఇజిఎస్ నిధుల ద్వారా రోడ్లు వేస్తున్నారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్ పామాయల్, టుబాకో, కోకో రైతులకు పరిశ్రమలు తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్నారు. ఏలూరులో వందేమాతరం ఎక్స్‌ప్రెస్ స్టాప్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం. ఎంపీ, ఎంఎల్ఎ ఎంఎస్ఎంఇ పార్క్ త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందంజ

నందిగం సీతారామ్ తిలక్(బాబీ)



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు 24 గంటల్లో వారి అకౌంట్‌లో నగదు జమ అవ్వటం మొదటిసారి. ఆ ఘనత కూటమి ప్రభుత్వానిదే. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 3 ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారు. చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధుల మంజూరుకు కృషి అభినందనీయం. నియోజకవర్గం గతం కంటే అభివృద్ధిలో ముందుంటుంది.



అభివృద్ధి బాటలో ఎపి



హరి, టిడిపి కామవరపుకోట మండల అధ్యక్షులు

ప్రజాశక్తి - చింతలపూడి

కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి కనిపిస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమే రాష్టాన్ని అభివృద్ధి చేయగలరు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఇప్పటికే అన్ని పథకాలు అమలు చేసే విధంగా ప్రభుత్వం ముందుకు వెళుతుంది. ప్రజలకు అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తుంది. చింతలపూడి నియోజకవర్గంలో కామవరపుకోట మండలానికి సంవత్సర కాలంలో రూ.10 కోట్లు ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ మంజూరు చేశారు. మరో రూ.2 కోట్లు ఇస్తున్నారు. నియోజకవర్గంలో అన్ని రోడ్లు త్వరగా పూర్తవుతాయి. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారు.



అమలు చేయడం బాగుంది

ఎం.లక్ష్మి

ఎన్నికల సమయంలో టిడిపి కూటమి ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేయదు అనుకున్నాను. ఆగస్టు 15 నుంచి అమలు చేయడం బాగుంది. మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మహిళలు మంచి కోసం ఉపయోగించాలి.





దొందు దొందే..



మన రాష్ట్రంలోని ప్రధాన పత్రికలు రెండు రాజకీయ శిబిరాలుగా చీలిపోయిచాలా కాలం అయ్యింది. ఒకరు అవునంటే మరొకరు కాదనడం అందుకు అనుగుణంగా వార్తలను వండివార్చడంలో పోటాపోటీలు పడుతుంటాయి. పరస్పర యుద్ధ భేరీలు మోగిస్తుంటాయి. అయితే ఈ రెండు శిబిరాలు ప్రజా సమస్యలను, ఉద్యమాలను తమ పత్రికల్లో కనిపించకుండా చేయడంలో ఒకే విధానాన్ని అనుసరిస్తున్నాయంటే ఆశ్చర్యంగా వున్నా అదే సత్యం. ఈ వారంలో రాష్ట్రంలో జరిగిన కొన్ని పరిణామాలు వాటిపట్ల ఈ పత్రికలు అనుసరించిన వైఖరులు గమనిస్తే వీరి ఏకత్వం మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

మన రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల్లో పోలవరం ముంపు బాధితుల సమస్య అతి ప్రధానమైంది. ప్రకృతి ఒడిలో అతి నిర్మలంగా బ్రతికే గిరిజనులను పాలకులు అభివృద్ధి పేరుతో శాపగ్రస్తులుగా మార్చేసారు. విద్య, వైద్యం, రోడ్లు, మంచినీటి సదుపాయాలు లేని వెలివాడలలో అనాదబిడ్డలుగా వొదలేసారు. ఈ దీనుల పక్షాన నిలవాల్సిన ప్రధాన మీడియా అటువైపు కన్నెత్తి చూడడంలేదు. ఎప్పుడైనా చూస్తే పోలవరంలో అద్భుతం జరిగిపోతుందని, లేదా అధ:పాతాళానికి దిగజారిపోతుందని రాజకీయ కోణంలో రాయడమేతప్ప ప్రాజెక్టుకు సమిధలైపోతున్న గిరిజనుల బ్రతుకుల గురించి రాసిన పాపాన పోవడం లేదు. అంతరిక్షయానంలో దూసుకుపోతున్న నేటి కాలంలో డోలి మోతల్లో గర్భవతులను తీసుకవెడుతున్న గాథలు, రోజు కిలోమీటర్లకు పైగా నడిచి ప్రాథమిక పాఠశాలకు వెలుతున్న పసిబిడ్డలు, రోగాలతో రొప్పులతో ప్రాణాలు కోల్పోతున్న యువతీ యువకుల గురించి రాయడానికి వీరి కళంలో సిరావుండదు, వీరి పతిక్రల్లో చోటు దక్కదు. ముంపు బాధితుల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తేవడానికి, పార్లమెంట్‌లో వినిపించడానికి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి, ఉత్తమ పార్లమెంటేరియన్ జాన్ బ్రిట్రాస్ ఆధ్వర్యంలో రెండు బృందాలు గత శని, ఆదివారాల్లో అటవీ ప్రాంతాల్లో పర్యటించాయి. కొండలు, గుట్టలు, వాగులు, వంకలు దాటి చెట్టుకొకరు పుట్టకొకరుగా వున్న గిరిజనుల దరికి చేరి వారి బాధలను పరిశీలించిన వార్తలు ఈ రెండు శిబిరాల ప్రధాన మీడియా సంస్థలకు కనిపించలేదు. జాతీయ పత్రికలు రాసిన తర్వాత కూడా వీరి కనీస కంటిచూపునకు ఆ దీనుల బాధలు నోచుకోలేదు. ఇది ఏదో కాకతాళీయమో, అశ్రద్ధో, నిర్లక్ష్యమో అనుకుంటే పొరపాటు. ముంపు బాధితుల బాధలు రాస్తే దానికి కారణమైన కేంద్రం గురించి రాయాలి, కేంద్ర పాలకుల ఆగ్రహానికి గురికాకుండా వారి కరుణకటాక్షాలు తమ బాసుల మీద కొనసాగేలా చూడడం కోసం గిరిజన బిడ్డల గాథలను అడవికి ఒదిలేశారు.

నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా రైతులు ఊరుమ్మడిగా ఏకమై పోరాడుతున్నారు. తమ గ్రామంలో తాము కలిసి కూర్చొని మాట్లాడుకోవడానికి వీలులేకుండా 30 యాక్ట్ నిర్బంధంలో గ్రామస్తులు బ్రతుకుతున్నారు. మా భూమి ఇవ్వం అంటున్నందుకు అక్రమ కేసులను ఎదుర్కొంటున్నారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు, ఆ అన్నదాతలకు అండగా నిలిచేందుకు సోమవారం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు కరేడు గ్రామానికి వెళ్లారు. పరమార్శకు వచ్చిన నాయకులను ప్రజలు కలవకుండా గ్రామాన్ని వందల మంది పోలీసులు చుట్టుముట్టి నాయకులను బలవంతాన అరెస్టు చేసి పోలీసు స్టేషన్స్‌లో రోజంతా నిర్బంధించారు. ఇంత జరిగితే ఈ రెండు మీడియా శిబిరాలకు ఇది ప్రజా వార్తగా కనిపించలేదు. ఏదో ఇచ్చామంటే ఇచ్చామన్నట్లు ఓ మూలకు ఇంత రాశారు. ఇదే భూ సేకరణ మీద గతంలో పేజీల కొద్ది రాసిన వారు ఇప్పుడు దీర్ఘనిద్రలో వుంటే, అప్పుడు కీర్తించిన వారు కాగల కార్యం జరిగిపోతున్నందుకు మౌనదీక్షలో వున్నారు. కారణం ఏ కంపెనీ కోసం భూ సేకరణ జరుగుతుందో ఆ యజమాని ఈ రెండు మీడియా శిబిరాల రాజకీయ శ్రేయోభిలాషులకు అస్మదీయుడు కావడమే.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం కార్మికులు పోరాడుతుంటే అది ఆంధ్రుల హక్కుగా వీరికి గుర్తుకు రావడంలేదు. వేలాది కాంట్రాక్టు కార్మికులను బలవంతాన తొలగిస్తున్నా, పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్ పేరుతో ఇంటికి సాగనంపుతున్నా, 33 యూనిట్లను ప్రైవేటికరిస్తున్న కేంద్రం గురించి రాయకపోవడం దేనికి సంకేతం? అయితే ఓ పత్రిక మాత్రం అప్పుడప్పుడూ ప్రయివేటీకరణ గురించి రాస్తోంది. గత పదకొండు సంవత్సరాలుగా రాష్ట్రానికి అన్ని రకాలుగా తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వానికి మరోసారి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇవ్వడానికి పాలక, ప్రతిపక్షాలు పోటీలు పడుతుంటే ప్రధాన మీడియా కనీసం పల్లెత్తు రాత రాయలేక పోవడం ఆంధ్రుల ఆత్మాభిమానానికి క్షోభ కాదా! నిత్యం సవాళ్ళు, ప్రతిసవాళ్ళు, ప్రాంతాల పేర్లతో పులులు, సింహాలు అంటూ ప్రగల్భాలు పలికే పార్టీల నేతలు కేంద్రం ముందు ఇంతలా సాగిలపడుతుంటే ఒక్క మాట కూడా రాయలేని స్థితికి మీడియా దిగజారడం పాఠకులు హర్షించరని గుర్తించాలి.

రౌడిషీటర్ రాసలీలలు, కిలాడి లేడి జిత్తులు, వారల కొద్ది ఒకే వార్తను పేజీల కొద్ది రాయడానికి స్థలం వున్న పత్రికల్లో ప్రజావార్తలకు చోటు దక్కాలంటే పాఠకుల నిశిత విమర్శతో పాటు అక్షరాన్ని నిజంగా ప్రజాపక్షం నిలుపుతున్నదేవరో గుర్తించాలి, వాటిని ఆదరించాలి.

విభిన్న సంస్కృతుల సంగమం

చింతలపూడి

పూర్తి మెట్ట మండలాలతో నిండిన చింతలపూడి నియోజకవర్గం ఈ ప్రాంతానికే తలమానికంగా నిలిచింది. క్రీస్తు పూర్వమే విశ్వవిద్యాలయంలో విద్యా కేంద్రంగా భాసిల్లింది. భిన్న సంస్కృతులు, వృత్తులతో జిల్లాలో పేరొందింది. రెండు మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులు, ప్రాచీనమైన మద్ది ఆంజనేయస్వామి ఆలయం, జీలకర్రగూడెంలో బౌద్ధవిశ్వ విద్యాలయం తదితరాలు చింతలపూడి నియోజకవర్గానికి పెట్టని కోటలా ఉన్నాయి. ఉద్యాన తోటలకు ప్రసిద్ధి చెందడంతో పాటు పలు రంగాల్లో ముందుంది.

ప్రజాశక్తి – చింతలపూడి



రెడ్డి రాజుల పాలన..

చింతలపూడి నియోజకవర్గం స్వాతంత్రానికి పూర్వం రెడ్డిరాజుల పాలనలో ఉండేది. రెడ్డిరాజులు ఎన్నో దేవాలయాలు కట్టించారు. చెరువులు తవ్వించారు. కామవరపు కోట మండలం జీలకర్రగూడెంలోని మహా నాగపర్వతంపై మహా నాగుడనే బౌద్ధ గురువు క్రీస్తు పూర్వం 326లో బౌద్ధ విశ్వవిద్యాలయం స్థాపించారు. ఇక్కడ బౌద్ధారామాలు ఉన్నాయి. ఇవి చారిత్రక ఆనవాళ్లుగా పర్యాటకులను అలరిస్తున్నాయి.

జిల్లాలో నాలుగు మధ్యతరహా ప్రాజెక్టులు ఉంటే ఎర్రకాలువ, తమ్మిలేరు ప్రాజెక్టులు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. మొక్కజొన్న, నాటు పొగాకు, ఆయిల్‌పాం, కోకో తోటలకు నియోజకవర్గం ప్రసిద్ధి. ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ విజయం సాధిస్తుందోనని ప్రజలతో పాటు రాష్టం మొత్తం ఎదురుచూస్తోంది. ఎందుకంటే చింతలపూడి నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుస్తుందో ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ ఉంది.

నాలుగు మండలాలు.. ఒక మున్సిపాల్టీ..

నియోజకవర్గంలో చింతల పూడి, లింగపాలెం, కామవరపుకోట, జం గారెడ్డిగూడెం మండలాలు ఉన్నాయి. అలాగే 74 గ్రామ పంచాయతీలు, ఒక మున్సిపాల్టీ, ఒక నగర పంచాయతీ ఉన్నాయి. చింతలపూడి నగర పంచాయతీగా, జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీగా ఉంది. 1962లో చింతలపూడి నియోజకవర్గం ఏర్పడింది. 14 సార్లు ఎన్నికలు జరిగాయి. ఐదుసార్లు కాంగ్రెస్, ఆరుసార్లు టిడిపి, రెండుసార్లు స్వతంత్రులు, ఒకసారి వైసిపి అభ్యర్థి ఇక్కడ విజయం సాధించారు.

నియోజకవర్గంలో గెలుపోటముల చరిత్ర

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1962	ఆర్.ఏసుపాదం	కాంగ్రెస్	కె.సుబ్బారావు	సిపిఐ
1967	జి.విష్ణుమూర్తి	కాంగ్రెస్	ఐ.పాపారావు	స్వతంత్ర
1972	డి.కోనేశ్వరరావు	స్వతంత్ర	ఇమ్మానుయేల్	కాంగ్రెస్
1978	గద్దె వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	ఎం.సత్యనారాయణ	జనతా
1983	కోటగిరి విద్యాధర్‌రావు	స్వతంత్ర	గద్దె వెంకటేశ్వరరావు	కాంగ్రెస్
1985	కోటగిరి విద్యాధరరావు	టిడిపి	మందలపు సత్యనారాయణ	కాంగ్రెస్
1989	కోటగిరి విద్యాధరరావు	టిడిపి	మందలపు సత్యనారాయణ	కాంగ్రెస్
1994	కోటగిరి విద్యాధరరావు	టిడిపి	మందలపు సత్యనారాయణ	కాంగ్రెస్
1999	కోటగిరి విద్యాధరరావు	టిడిపి	మందలపు జమునారాణి	కాంగ్రెస్
2004	ఘంటా మురళీ	కాంగ్రెస్	కోటగిరి విద్యాధరరావు	టిడిపి
2009	మద్దాల రాజేష్	కాంగ్రెస్	కర్రా రాజారావు	టిడిపి
2014	పీతల సుజాత	టిడిపి	బూర్ల దేవీప్రియ	వైసిపి
2019	ఉన్నమట్ల ఎలిజా	వైసిపి	కర్రా రాజారావు	టిడిపి
2024	సొంగా రోషన్‌కుమార్	టిడిపి	కె.విజయరాజు	వైసిపి



రూ.4 వేలు పింఛను ఇవ్వడం సంతోషంగా ఉంది

లావేటి సత్యవతి, చింతలపూడి

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రూ.4,000 పింఛను ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.3 వేలు పింఛను మాత్రమే ఇచ్చేవారు. ప్రతినెలా ఒకటో తేదీన అధికారులు ఇంటికి వచ్చి పింఛను ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నాం



ఎస్.కిరణ్‌బాబు, ఎంఇఒ -2, చింతలపూడి

చింతలపూడి మండలంలో ఎస్ఆర్‌కెవిఎం స్టూడెంట్ కిట్లు 700 మందికి అందజేశాం. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నాం. జూన్ 10వ తేదీన పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహించాం. గ్రీన్ పాస్‌పోర్ట్ కాన్సెప్ట్ ద్వారా పిల్లల తల్లిదండ్రుల పేరుమీద మూడేళ్లపాటు మొక్కలను సంరక్షించడం జరుగుతుంది. మండలంలో ఎయిడెడ్ నుంచి స్వాధీనం చేసుకున్న లింగగూడెం, ఎండపల్లి, గురుపట్లగూడెం, సుప్రీంపేట, పాఠశాలల సొంత భవనాల నిర్మాణం కోసం ప్రయత్నం జరుగుతోంది. చింతలపూడిలో పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాం. ఎపిఎస్‌డబ్ల్యూఆర్ బాయ్స్ హైస్కూల్లో తాగునీటి బోరు వేశాం.

హామీలు అమలు చేస్తున్న కూటమి



బేతు మహాలక్ష్మడు, ప్రగడవరం రైతు

అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రూ.ఏడు వేలు కూటమి ప్రభుత్వం అందించింది. ఎరువులు కొనడానికి ఉపయోగపడ్డాయి. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుంది. తల్లికి వందనం పథకంలో భాగంగా లబ్ధి పొందాం. చింతలపూడి నియోజకవర్గంలో ఎప్పుడు ఏ సమస్యపై వెళ్లినా ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ వెంటనే పరిష్కరిస్తున్నారు.



పింఛను ఎంతో చేయూత

గురిజాల బాయమ్మ, దేశవరం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త పింఛను రూ.4 వేలు ఇస్తోంది. అధికారులు ఇంటి వద్దకు తీసుకొచ్చి మరీ ఇస్తున్నారు. ఈ నాలుగు వేల రూపాయలు మా ఉపాధికి ఎంతో ఉపయోగపడుతోంది. ఖర్చులకు చేయూతగా ఉంటుంది.

హామీ నెరవేర్చింది..



కలపాల జయరాజు, శివపురం

కూటమి ప్రభుత్వం వచ్చాక వెంటనే పింఛను పెంచి ఇస్తారని అనుకోలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3,000 నుంచి రూ.4 వేలకు పెన్షన్ పెంచి ఇవ్వడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది.



ఎంఎల్ఎ పనితీరు బాగుంది

మానేపల్లి శ్రీను, రైతు ముక్కంపాడు

అన్నదాత సుఖీభవ రూ.7 వేలు పడ్డాయి. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఈ సమయంలో పొలానికి ఎరువులు కొనటానికి ఉపయోగపడతాయి. చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ పనితీరు బాగుంది. ఎప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యపై వెళితే వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు



కొమ్ము తిరుపతిరావు, రైతు ప్రగడవరం

అన్నదాత సుఖీభవ నగదు రూ.7 వేలు వ్యవసాయం కోసం ఉపయోగపడ్డాయి. ఆ డబ్బులతో యూరియా, ఇతర కలుపు మందు కొనుగోలు చేశాను. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

కార్యకర్తలకు ఎక్కువ ప్రాధాన్యత



మానేపల్లి రాజారావు, రైతు

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసింది. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రూ.7 వేల నగదు జమ చేశారు. కూటమి ప్రభుత్వానికి, చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎకి కృతజ్ఞతలు. కార్యకర్తలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే ఎంఎల్ఎ మా నియోజకవర్గానికి దొరకటం అదృష్టం.

అభివృద్ధిలో ముందడుగు..



చక్రపు మారేశ్వరరావు, నారా లోకేష్ యువజన ఫౌండేషన్ కార్యదర్శి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలలో దూసుకుపోతుంది. దానికి రాజధాని పనులు, పోలవరం ప్రాజెక్టు నిధులు, రోడ్లు, తల్లికి వందనం, రైతులకు డ్రిప్ ఇరిగేషన్, ఎరువులు,అన్నదాత సుఖీభవ వంటివి నిదర్శనమన్నారు. బిసిలు అంటే టిడిపి.. టిడిపి అంటే బిసిలను నినాదంతో పార్టీని ముందుకు నడుపుతూ, బిసిలకు అనేక పథకాలను పెట్టి, బిసిలను ఆర్థికంగా అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ అనేక సంక్షేమాలు కూటమి ప్రభుత్వం అందిస్తుంది.

సూపర్ సిక్స్ - సూపర్ హిట్



సుధీర్ రెడ్డి, ప్రగడవరం

కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు, బడుగు బలహీన తరగతుల అభ్యున్నతికి రూ.వేల కోట్ల నిధులు ఖర్చు చేస్తోంది. సూపర్ సిక్స్‌తో పాటు ప్రజా సంక్షేమ పాలనకే కొత్త నిర్వచనం ఇస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజునే ఐదు సంతకాలతో ప్రధాన హామీల అమలుకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం వాటిని అమల్లోకి తెచ్చింది.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

కనమతరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎంపిటిసి మాజీ సభ్యులు



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుంది. ఒకవైపు ప్రజా సంక్షేమం, మరొకవైపు రాష్ట్రాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అమరావతి రాజధాని అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. నిధుల కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఏడాది కాలంలో చింతలపూడి నియోజకవర్గ ముఖ చిత్రం మారబోతుంది.

చాలా సంతోషంగా ఉంది..

ఉబ్బల పాప, చింతలపూడి



గత వైసిపి ప్రభుత్వంలో కొత్త పెన్షన్ కోసం దరఖాస్తు చేసినప్పటికీ పింఛను రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త పింఛను వచ్చింది. చాలా ఆనందంగా ఉంది. చేదోడు, తోడ్పాటుకు ఉపయోగపడుతుంది. పింఛను రావడం ఎంతో సంతోషంగా ఉంది.

జన, కుల గణనలో కీలకాంశాలు

(6వ పేజీ నుంచి)

ఆధారంగా దీనిని చేపట్టబోతున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కూడా జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరుగుతుంది.

అదీకాక ఇక్కడ ఒక భయాందోళన కూడా వ్యక్తమవుతోంది. జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్.పి.ఆర్)ను తాజా పరచడం కోసం దీనిని ఉపయోగించవచ్చునని, ఆ తర్వాత దానిని వివాదాస్పద జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్.ఆర్.సి) కోసం కూడా ఉపయోగిస్తారని అనుమానిస్తున్నారు. పైగా అధికార పార్టీ విభజన ఎజెండాను ముందుకు తీసుకుపోవడానికి గణన ప్రక్రియను దుర్వినియోగం చేయవచ్చునని కూడా భయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే జనగణనతో పాటు ఎన్.పి.ఆర్‌ను తాజా పరచరాదన్న డిమాండ్ బలపడుతోంది.

జనగణన సమాచారాన్ని విస్తృతంగా ఉపయోగించవచ్చు. దానిని సక్రమంగా ఉపయోగించుకుంటే విధాన రూపకల్పనకు, ప్రభుత్వ వనరుల పంపిణీకి మార్గదర్శనం చేయడానికి దోహదపడుతుంది. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు మంత్రిత్వ శాఖలకు ఈ సమాచారం తప్పనిసరి. వలసలు, ఉపాధి, సామాజిక చలనశీల ధోరణులను అర్థం చేసుకోవడానికి విధాన నిర్ణేతలకు సాయపడుతుంది.

కుల సమాచారం ఉపయుక్తమైనదే అయినప్పటికీ అది అన్నింటికీ మందు కాదు. కుల సమాచారం అందుబాటులో ఉన్నచోట కూడా ఎస్సీ, ఎస్టీలలో అసమానతలు వేళ్లూనుకుపోయి ఉన్నాయి. కేవలం కులగణన ద్వారా న్యాయం చేకూరదు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడడంలో మన నిబద్ధతను అనవసరమైన భ్రమలు బలహీనపరుస్తాయి. ముఖ్యంగా మోడీ ప్రభుత్వ హయాంలో నయా ఉదారవాద విధానాలు సంక్షేమ కార్యక్రమాలను బలహీనపరిచాయి. ప్రైవేటీకరణను ప్రోత్సహించాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాయి. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన పథకాలను నీరుకార్చాయి. ఈ వ్యవస్థీకృత సమస్యలను సవాలు చేయని పక్షంలో కులగణన మాత్రమే పేదలు, అణగారిన వర్గాల జీవితాలను మార్చదు.

అయినా న్యాయం కోసం జరిపే పోరాటంలో కుల సమాచారం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. అసమానతల నిజ స్వభావాన్ని బహిర్గతం చేయడానికి, ప్రస్తుత విధానాల వైఫల్యాన్ని బయటపెట్టడానికి, కుల ఆధారిత రాజకీయాలను ఎండగట్టడానికి ఇది సాయపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరిస్తే కులాలకు అతీతంగా నిర్మాణాత్మక మార్పుల కోసం పోరాడే విస్తృత ఉద్యమం ఊపిరి పోసుకుంటుంది. నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, గృహ నిర్మాణం, భూసంస్కరణలు, ఉపాధి హామీలు, ప్రభుత్వ సేవల కల్పనలో సార్వత్రిక ప్రవేశం లభిస్తుంది.

-బి.వి. రాఘవులు, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

పిల్లలు ఆడుకుంటున్నప్పుడు మనం వారి ఆకాంక్షలను గమనిస్తూ వుండాలి. వాటి వెనక వున్న వారి ఆకాంక్షలు అర్థం చేసుకుంటూ వుండాలి. వాటికి మనం చేయూతనిస్తే...ఆ పిల్లలే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తయారవుతారు.

- గిజూభాయి, ప్రసిద్ధ విద్యావేత్త.

సంక్షేమ పథకాలు అమలుకు కృషి

కొప్పెర్ల నాగరాజు, జిల్లా సాధికార కమిటీ అధ్యక్షులు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకురావడం జరిగింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, బిసిలకు, నాయి బ్రాహ్మణులకు 200 యూనిట్ల కరెంటు, కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం, చేనేత కార్మికులకు కరెంటు 200 నుంచి 500 యూనిట్ల వరకు ఇవ్వటం కూటమి ప్రభుత్వానికే సాధ్యం. గత ప్రభుత్వంలో ఎక్కడా ఒక్క రోడ్డు కూడా వేయలేదు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఒక సంవత్సర కాలంలోనే దాదాపు 70 శాతం రోడ్లు పూర్తిచేశారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఏ కష్టం వచ్చినా నేనున్నానని ధైర్యం చెబుతూ ముందుకు తీసుకెళుతున్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే అమలు చేస్తూ ముందుకు సాగుతుంది.

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

బోడ అనీష్, ఐటిడిపి నియోజకవర్గ కన్వీనర్



కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని భావిస్తుంది. గత 5 సంవత్సరాలలో రాష్ట్రాభివృద్ధి శూన్యం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహాయ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కలిసి రాష్ట్రాన్ని సంక్షేమంతో పాటు అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎల్ఎ రోషన్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. నిత్యం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు. రోడ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పరిశ్రమలు, పెట్టుబడుల కోసం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించటానికి కృషి చేస్తున్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గం అభివృద్ధి మరింతగా జరుగుతుంది.

సూపర్ సిక్స్ పథకాలు అమలు

కొండ్రు దేవ, ప్రభుత్వ ఏరియా హాస్పటల్ అభివృద్ధి కమిటీ మెంబర్, చింతలపూడి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాల్లో దాదాపు అన్నీ అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో అభివృద్ధిలో చింతలపూడి నియోజకవర్గాన్ని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఒక రోల్ మోడల్‌గా నిలబెట్టి వంద పడకల ఆస్పత్రిని మరో రెండు నెలల్లో ప్రారంభించడానికి వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే నియోజకవర్గంలో మేజర్ సమస్య అయిన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నారు. కూటమి నాయకుల సమిష్టి సహకారంతో ఇండస్ట్రియల్ కారిడర్‌ను ఏర్పాటు చేసి పరిశ్రమ స్థాపనకు, ఉద్యోగాల కల్పనకు కృషి చేశారు.


ప్రజా సంక్షేమమే కూటమి ప్రథమ లక్ష్యం

నరేష్ నాయుడు, జనసేన పట్టణ ఉపాధ్యక్షులు



కూటమి ప్రభుత్వం అంటే మాట ఇస్తే పనిచేసి చూపే పాలన. ప్రతి కుటుంబానికి సంతోషం, ప్రతి రైతు ముఖంలో చిరునవ్వు, ప్రతి యువకుడికి అవకాశమే లక్ష్యం. అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. రహదారులు, నీటి వసతులు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు అన్నీ కొత్త స్థాయికి చేరుతున్నాయి. అవినీతి లేకుండా, పారదర్శకంగా, ప్రతి రూపాయి ప్రజల కోసమే ఖర్చవుతున్న పాలన ఇది. కూటమి పాలనలో ప్రజల కలలు నిజమవుతాయి, భవిష్యత్తు బలపడుతుంది.

జైలుశిక్ష అనుభవించిన తొలి జర్నలిస్టు గాడిచర్ల



తాను రచించిన వ్యాసాల కారణంగా మూడు సంవత్సరాలకు పైగా కఠిన కారాగార శిక్షను అనుభవించిన జర్నలిస్టు గాడిచర్ల హరిసర్వోత్తమరావు. రాయలసీమ ప్రాంతంలో జన్మించిన గాడిచెర్ల మద్రాసు (చెన్నై) విద్యాలయంలో ఎంఎ పట్టా పొందారు. తరువాత రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతూనే వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నారు. 'స్వరాజ్య' పత్రికలో 'విపరీత బుద్ధి' అనే శీర్షికతో "అరెరె ఫిరంగీ క్రూరవ్యాఘ్రమా, నిష్కారణంగా నీవు ముగ్గురు భారతీయులను ఒక్కసారిగా పొట్టను పెట్టుకుంటివి గదా!" అంటూ తమిళనాడులో జరిగిన పోలీసుల కాల్పులను ఖండిస్తూ ఒక వ్యాసం రాశారు. దీనితోపాటు "సాత్విక ప్రతిఘటన-నిష్ఫలత్వం' పేర అప్పట్లో బెంగాల్‌లో ప్రవేశపెట్టిన "రాజద్రోహకర సభల చట్టాన్ని" నిరసించుతూ మరో వ్యాసాన్ని రాశారు. "యుద్ధం అనివార్యం" అనే రీతిలో "మాతృ సందర్శనం- రాబోవు యుద్ధం" వ్యాసాన్ని కూడా రాశారు. మూడు వ్యాసాలూ బ్రిటీష్ పాలకులకు ఆగ్రహం కలిగించాయి. హరిసర్వోత్తమరావుపై రాజద్రోహం నేరాన్ని మోపుతూ 1908 జూన్ 18వ తేదీన అరెస్టు చేశారు. కృష్ణాజిల్లా సెషన్స్ జడ్జి ఆరు నెలల జైలుశిక్షను విధించాడు. ఆయన చేసిన రాజద్రోహ నేరానికి కింది కోర్టు విధించిన శిక్ష ఏ మాత్రం చాలదని హైకోర్టు మూడు సంవత్సరాలకు శిక్షను పెంచింది. జైలులో ఆయన అత్యంత బాధాకరమైన నిర్బంధ విధానాన్ని అనుభవించారు. రాజద్రోహం నేరం కింద ఇంతటి దారుణ జైలు శిక్షను అనుభవించిన హరిసర్వోత్తమరావు గారితో మాట్లాడటానికి అనేకమంది భయపడిన రోజులవి. తొలి తెలుగు దినపత్రికను ప్రారంభించిన కాశీనాథుని నాగేశ్వరరావుగారు ఆయనను 'ఆంధ్రపత్రిక' దినపత్రికకు మొదటి సంపాదకుడుగా నియమించే సాహసానికి సిద్ధపడ్డారు. అప్పట్లో దత్త మండలాల పేర వాడుకలో వున్న ప్రాంతానికి రాయలసీమ అన్న పేరును ప్రచారం చేసింది గాడిచెర్లే. అలాగే 'ఎడిటర్' అన్న ఇంగ్లీషు పదాన్ని తెలుగులో "సంపాదకుడు" అని మొదట వాడినది కూడా ఆయనే. ఆ తరువాత కాలంలో ఆయన క్రియాశీల రాజకీయాల నుండి విరమించి గ్రంథాలయ ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేశారు. ఆంధ్ర గ్రంథాలయోద్యమ కార్యాలయానికి విజయవాడలో హరిసర్వోత్తమరావు భవనం అని నామకరణం చేశారు.

కార్మిక వర్గం చేసే పోరాటాల విజయం అది సాధించే తక్షణ ఫలితాలలో లేదు. ఈ పోరాటాల క్రమంలో అది సాధించే అపూర్వ ఐక్యతే అతి గొప్ప విజయం.

- కారల్ మార్క్స్



ఎన్నికలలో ఓడిన ఇందిరా గాంధీ జె.ఎన్.యు ఛాన్సలర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ...ఆమె సమక్షంలో తీర్మానాన్ని చదువుతున్న అప్పటి ఎస్.ఎఫ్.ఐ-జె.ఎన్.యు నాయకుడు సీతారాం ఏచూరి (ఫైల్ ఫోటో)

ఎమర్జెన్సీతో తలపడిన ఒక తరం యువ కార్యకర్తలు

యాభై ఏళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే మన దేశ ప్రజాస్వామిక వ్యవస్థ మీద తొలిసారి గా జరిగిన దాడిగా 'ఎమర్జెన్సీ' అందరి మదిలో నిలిచిపోతుంది. అయితే ఇది హఠాత్ పరిణా మంగా భావించరాదు. 1950ల నుంచే ప్రజల ప్రజాస్వామిక హక్కుల మీద, పౌరహక్కుల మీద క్రమేణా పెరుగుతూ వచ్చిన దాడులకు కొన సాగింపుగా జరిగిన పెను దాడిగా మనం గుర్తించాలి. అలాగే ఇవాళ దేశంలో నెలకొన్న పరిస్థితులను ఎమర్జెన్సీ కాలంతో సాపత్యం పెట్టి చూడడం కూడా పొరబాటు. గత పద కొండేళ్లుగా మోడీ హయాంలో సాగుతున్న పాలనను 'అప్రకటిత ఎమర్జెన్సీ'గా పేర్కొనడం కూడా సరైన అవగాహన కాజాలదు. ప్రస్తుతం ప్రజాస్వామ్యం మీద, రాజ్యాంగ సూత్రాల మీద జరుగుతున్నది సంస్థాగతంగా నిరంకుశత్వాన్ని నెలకొల్పుతున్న దొంగ దాడి. ఇవాళ దేశం యావత్తు చవిచూస్తున్న అపరిమిత నిరంకుశ పోకడలతో పోల్చి చూస్తే ఎమర్జెన్సీ తేలిపోతుంది.

ప్రధాని ఇందిరా గాంధీ 1975లో ప్రకటించిన ఎమర్జెన్సీ...ప్రజాస్వామ్య పరి రక్షణకు కీలకమైన పోరాట సందర్భంగా, రాజ్యాంగ హక్కుల బోలుతనాన్ని వెల్లడించేదిగా, నిరంకుశ అధికారం తలెత్తడానికి దారితీసిన పరిస్థితిగా ముందుకు వచ్చింది. ఎమర్జెన్సీ ప్రకటనను, దేశ ప్రజానీకం మీద నిరంకుశ పరిపాలన శాశ్వతంగా రుద్దడానికి చేపట్టిన దుర్మార్గపు చర్యగా సి.పి.ఐ (యం) నాయకత్వం తొలుత భావించింది. సుదీర్ఘ కాలంపాటు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పాతర వేసే అవకాశం ఉన్నదని అంచనా వ్యక్తం చేసింది. అయితే కొద్ది వారాలలోనే ఇది ప్రతిపక్ష రాజకీయ పక్షాలను చెదరగొట్టడానికి శ్రీమతి గాంధీ చేపట్టిన తెలివిమాలిన చర్యగా స్పష్టమయ్యింది.

1971లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో 'గరీబీ హఠావో' నినాదంతో శ్రీమతి గాంధీ అధికారాన్ని గెలుచుకున్నారు. అయితే ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన అనేక వాగ్దానాలను శ్రీమతి గాంధీ ప్రభుత్వం నెరవేర్చని ఫలితంగా ప్రజలలో పెద్ద ఎత్తున అసంతృప్తి గూడుకట్టుకున్నది. 1974లో రైల్వే కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె, బీహార్‌లో జయప్రకాష్ నారాయణ మొదలు పెట్టిన 'సంపూర్ణ విప్లవం' ఉద్యమం-ఈ రెండూ నాడు ప్రజలలో నెలకొన్న అసంతృప్తికి తార్కాణాలు. శ్రీమతి ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లనేరదని అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో అది ,కారాన్ని నిలబెట్టుకోవడానికి ఈ అసాధారణమైన అప్రజాస్వామిక చర్యకు శ్రీమతి గాంధీ పూనుకున్నారు. చిల్లర రాజకీయ ప్రయోజనం కోసం చేపట్టిన ఈ చర్యను ప్రజాస్వామిక పరిరక్షణ కోసం ప్రజానీకాన్ని పెద్ద ఎత్తున కదిలించడం ద్వారా వమ్ము చెయ్యవచ్చు.

దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించే నాటికి నేను భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) జాతీయ కార్యదర్శిగా, సిపిఐ(యం) కార్యకర్తగా పని చేస్తూ జవహర్‌లాల్ నెహ్రూ యునివర్శిటీ (జె.ఎన్.యు)లో డాక్టరేట్ పరిశోధక విద్యార్థిగా ఉన్నాను. అప్పటికి ఎస్ఎఫ్ఐ స్థాపించి (1970) ఐదేళ్లు అయింది. కానీ విద్యార్థుల హక్కుల పరిరక్షణలో, ఇందిరా గాంధీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించడంలో సమరశీల సంఘంగా పేరు తెచ్చుకున్నది. ఈ కారణంగానే ఎమర్జెన్సీలో ఎస్ఎఫ్ఐ మీద దాడులు జరిగాయి. ఎస్ఎఫ్ఐకి చెందిన తొమ్మిది మంది కీలక ఆఫీస్ బేరర్లను, నాయకులను అరెస్టు చేసి అంతర్గత భద్రతా చట్టం (మీసా) కింద జైల్లో కుక్కారు. తదనంతరం మరో 60 మందిని మీసా చట్టం కింద జైలు పాల్జేశారు. దేశవ్యాప్తంగా వందల మంది విద్యార్థి నాయకులను, క్రియాశీల కార్యకర్తలను మరో నిర్బంధ చట్టం డిఐఆర్ కింద అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఈ నేపథ్యంలో అరెస్టుకి చిక్కకుండా అజ్ఞాతంలో ఉండి పని చేయమని పార్టీ నన్ను ఆదేశించింది. విద్యార్థి సంఘం జాతీయ స్థాయిలో కనీస కార్యకలపాలు నిర్వహించేలా చూడమని నాకు బాధ్యత అప్పచెప్పింది.

ఢిల్లీలో అధికారగణం జె.ఎన్.యు విద్యార్థుల మీద, విద్యార్థి సంఘం మీదా దాడులు ముమ్మరం చేసింది. జులై 7వ తేదీన వందలాది మంది పోలీసుల విశ్వవిద్యాలయ హాస్టళ్లను చుట్టుముట్టి ఇంటరాగేషన్ పేరిట అనేక మందిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అందులో పది మందిని అదుపులోకి తీసుకుని మిగిలిన వారిని విడిచిపెట్టారు. ఎస్.ఎఫ్.ఐ నాయకత్వంలో జె.ఎన్.యు విద్యార్థులు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రతిఘటనోద్యమాన్ని నిర్వహించసాగారు. పోలీసులు విద్యార్థి సంఘం అధ్యక్షుడు డి.పి. త్రిపాఠీని అరెస్టు చేయ్యడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. కర్కోటక పోలీసుగా పేరొందిన డి.ఐ.జి పి.యస్ భిందర్ పోలీసు యూనిఫారం లేకుండా హాస్టల్లోకి ప్రవేశించి ఎస్.ఎఫ్.ఐ కార్యకర్త ఒకరిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. అయితే డి.పి త్రిపాఠీ అనుకుని ప్రబీర్ పుర్కాయస్థను ఎత్తుకెళ్లారు. జరిగిన పొరపాటును సరిదిద్దుకోవడానికి బదులుగా పోలీసులు ప్రబీర్ మీద అక్రమ అభియోగాలు మోపి మీసా కింద అరెస్టు చేసి ఎమర్జెన్సీ ముగిసేంతవరకూ జైల్లో పెట్టారు. విశ్వవిద్యాలయ అధికారులు విద్యార్థి నాయ కుడిని బహిష్కరించిన నేపథ్యంలో జె.ఎన్.యు విద్యార్థులు మూడు రోజుల పాటు సమ్మె చేశారు.

వివిధ భావజాలాలతో పలు విద్యార్థి సంఘాలలో పని చేస్తున్న విద్యార్థులందరూ దేశవ్యాప్తంగా ఐక్యమై నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అజ్ఞాత జీవితం గడుపుతున్నప్పటికీ నేను విద్యార్థి సంఘం కార్యకలాపాలు నడిచేలా చూడడానికి వివిధ రాష్ట్రాలు తిరిగాను. కొన్ని చోట్ల అజ్ఞాత సమావేశాలు నిర్వహించాను. నాడు తమిళనాడు ముఖ్యమంత్రిగా డి.ఎం.కె పార్టీకి చెందిన కరుణానిధి ఉండడం, ఆయన ఎమర్జెన్సీని బహిరంగంగానే వ్యతిరేకించడంతో ఎమర్జెన్సీ వ్యతిరేక శక్తులు సమావేశాలు నిర్వహించు కోవడానికి చెన్నై సురక్షిత స్థావరంగా మారింది. ఇది పసిగట్టిన ఇందిర ప్రభుత్వం 1976 జనవరిలో కరుణానిధి ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దు చెయ్యడంతో ఆ గూడు కాస్తా చెదిరి పోయింది.

21 నెలల్లో ఎమర్జెన్సీ ముగిసిపోయింది. ఈ కాలంలో నా వ్యక్తిగత జీవితం కూడా అనేక మలుపులు తిరిగింది. సిపిఐ(యం)లో పనిచేస్తున్న తోటి కార్యకర్త బృందాతో నా వివాహం జరిగింది. మేం ఇద్దరం పాక్షికంగా అజ్ఞాత జీవితం గడుపుతున్నందున మా వివాహం ఒక కామ్రేడ్ నివాసంలో గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయింది. బృందా 'రీటా' అనే మారు పేరుతో, నేను 'సుధీర్' అనే మారు పేరుతో అజ్ఞాత జీవితం గడిపాం. జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటుండగా...నన్ను పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులు నేర్పించిన మా అమ్మ కూడా ఈ కాలంలోనే మరణించి నాకు తీరని విషాదాన్ని మిగిల్చింది. నేను అజ్ఞాత జీవితం గడుపుతున్న మూలాన కొద్దికాలం అమ్మకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే బృందాతో వివాహమయ్యాక అమ్మను తీసుకొచ్చి మాతోనే ఒక చిన్న అవుట్‌హౌస్‌లో అట్టేపెట్టుకున్నాం. నాలుగు నెలలు తిరగకుండానే 54 ఏళ్ల వయసులో అమ్మ చనిపోయింది.

ఒక తరం పార్టీ కార్యకర్తలకు అప్పుడే మొదలైన ఉద్యమ జీవితంలో ఎమర్జెన్సీ అనేక అనుభవాలను మిగిల్చింది. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక హక్కులలో బోలుతనం ఏమిటో అర్థమయ్యేలా చేసింది. ప్రజాస్వామ్య హక్కుల పట్ల బేఫర్వాగా ఉండకూడదని తెలియజెప్పింది. అలాగే ప్రజల మధ్య ఉండి పనిచేయడం, ముఖ్యంగా విద్యార్థులతో కలిసి పని చెయ్యడం ద్వారా శ్రమకోర్చి సాధించుకున్న హక్కులను చేజారనీకుండా పరిరక్షించుకునేది అంతిమంగా ఆ ప్రజలే అన్న సత్యం బోధపడింది.

ఎమర్జెన్సీ కాలంలో చురుగ్గా పని చేసి తీవ్ర నిర్బంధాలను ఎదుర్కొన్న ఎస్.ఎఫ్.ఐ నాయకులు, కార్యకర్తలు తదనంతర కాలంలో సిపిఐ(యం) అగ్ర నాయకులుగా ఎదిగారు. మాణిక్ సర్కార్, కొడియేరి బాలకృష్ణన్, సీతారాం ఏచూరి, యం.ఎ.బేబి వంటి వారు ఈ కోవకు చెందినవారే. ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థి, యువజన ఉద్యమాలకు నాయకత్వం వహించిన అనేక మంది వారి, వారి రాష్ట్రాలలో వివిధ రాజకీయ పార్టీలలో అగ్ర నాయకులుగా ఎదిగారు.

యాభై ఏళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే మన దేశ ప్రజాస్వామిక వ్యవస్థ మీద తొలిసారిగా జరిగిన దాడిగా 'ఎమర్జెన్సీ' అందరి మదిలో నిలిచిపోతుంది. అయితే ఇది హఠాత్ పరిణామంగా భావించరాదు. 1950ల నుంచే ప్రజల ప్రజాస్వామిక హక్కుల మీద, పౌరహక్కుల మీద క్రమేణా పెరుగుతూ వచ్చిన దాడులకు కొనసాగింపుగా జరిగిన పెను దాడిగా మనం గుర్తించాలి.

అలాగే ఇవాళ దేశంలో నెలకొన్న పరిస్థితులను ఎమర్జెన్సీ కాలంతో సాపత్యం పెట్టి చూడడం కూడా పొరబాటు. గత పదకొండేళ్లుగా మోడీ హయాంలో సాగుతున్న పాలనను 'అప్రకటిత ఎమర్జెన్సీ'గా పేర్కొనడం కూడా సరైన అవగాహన కాజాలదు. ప్రస్తుతం ప్రజాస్వామ్యం మీద, రాజ్యాంగ సూత్రాల మీద జరుగుతున్నది సంస్థాగతంగా నిరంకుశత్వాన్ని నెలకొల్పుతున్న దొంగ దాడి. ఇవాళ దేశం యావత్తు చవిచూస్తున్న అపరిమిత నిరంకుశ పోకడలతో పోల్చి చూస్తే ఎమర్జెన్సీ తేలిపోతుంది.

అభివృద్ధి, సంక్షేమం ప్రధాన లక్ష్యాలు

రావూరి కృష్ణ, టిడిపి మాజీ పట్టణ అధ్యక్షులు, జంగారెడ్డిగూడెం



టిడిపి సూపరిపాలనలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శకత ప్రధాన లక్ష్యాలు. పేదల సంక్షేమ పథకాలు, రహదారి, విద్యుత్, నీటి సదుపాయాల విస్తరణ, పరిశ్రమల ప్రోత్సాహం, రైతులకు మద్దతు, మహిళలకు స్వావలంబన వంటి రంగాల్లో మంచి ఫలితాలు సాధించింది. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యలకు త్వరిత పరిష్కారం, ఆధునిక, సాంకేతిక వినియోగం వల్ల ఈ సంవత్సర కాలంలో 'సూపర్‌పాలన'గా గుర్తింపు పొందింది.

కూటమి కార్యకర్తలకు న్యాయం

చంద్రశేఖర్‌రెడ్డి, యర్రంపల్లి సొసైటీ చైర్ పర్సన్

ప్రజాశక్తి - చింతలపూడి



కూటమి ప్రభుత్వంలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ న్యాయం జరుగుతుంది. ఎన్ని ఇబ్బందులు ఉన్నా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుంది. కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి బాటలు వేస్తుంది. చింతలపూడి నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రి త్వరగా పూర్తవ్వటానికి ఎంఎల్ఎ రోషన్‌కుమార్ నిధులు తీసుకొస్తున్నారు. గతంలో ఎప్పుడూ చూడని అభివృద్ధి చింతలపూడి నియోజకవర్గంలో కనిపిస్తుంది.

పెన్షన్ ఇంటికొచ్చి ఇస్తున్నారు

గొల్లపల్లి సత్యం, ఫాతిమాపురం



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వికలాంగ పెన్షన్ రూ.ఆరు వేలు వస్తుంది. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ సొమ్ము అధికారులు ఇంటికి తీసుకొచ్చి ఇస్తున్నారు. నాకు నా కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుంది. కూటమి ప్రభుత్వనికి కృతజ్ఞతలు.

24 గంటల్లో ధాన్యం డబ్బులు పడ్డాయి

నరుకుళ్ల రవి, రైతు, శివపురం



టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంకోచ్చిన తర్వాత 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు పడ్డాయి. గత ప్రభుత్వంలో ఎప్పుడు పడతాయో తెలిసేది కాదు. 24 గంటల్లో నగదు పడటం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. అప్పులు, వడ్డీల నుంచి విముక్తి కలుగుతుంది.

హామీ నిలబెట్టుకోవడం ఆనందదాయకం

ఎన్ఎన్.అనంతలక్ష్మి, చింతలపూడి



కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం హామీని నిలబెటు కున్నందుకు ఆనందగా ఉంది. ఇది మహిళకు చేయూతగా ఉంటుంది. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.



మంచి పరిణామం

డి.రమాదేవి, చింతలపూడి



సూపర్ సిక్స్ హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం మంచి పరిణామం. మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మహిళ ఆర్థికంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు.

మహిళలకు ఎంతో ఉపయోగకరం

ఎం.భాగ్యలక్ష్మి, బోయగూడెం



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయటం బాగుంది. ఇది మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పని చేస్తుంది. కూటమి ప్రభుత్వానికి అభినందనలు.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

అడ్డురి రాఘవరావు, చింతలపూడి



గతంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించినా నగదు ఎప్పుడు వేసేవారో తెలిసేది కాదు. చాలా ఇబ్బందులు పడ్డాం. పెట్టుబడులకు అప్పు తీసుకొచ్చేవాళ్లం. వడ్డీలు పెరిగేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 24 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు పడ్డాయి. చాలా అనందంగా ఉంది. కూటమి ప్రభుత్వనికి కృతజ్ఞతలు

పింఛను ఎంతో ఉపయోగపడుతోంది..

జె.సరోజినీ ,యర్రగుంటపల్లి



కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పెన్షన్ రూ.4,000 ఇవ్వడం నాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. హాస్పటల్ ఖర్చులు, ఇంటి ఖర్చులకు వినియోగిస్తున్నాను. ప్రతి నెలా మొదటి తేదీన పింఛను అందజేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది

లంక నగేష్, యర్రగుంటపల్లి



కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇచ్చిన మాట ప్రకారం పింఛను పెంచి ఇస్తోంది. ఎటువంటి ఇబ్బందీ లేకుండా మొదటి తారీఖున అధికారులు ఇంటికి తీసుకొచ్చి ఇస్తున్నారు. బయట ఉన్నా ఫోన్ చేసి ఇస్తున్నారు. పెన్షన్ పెంచి ఇవ్వడం వల్ల ఎంతగానో ఉపయోగపడుతోంది.






నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనుల గురించి సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తున్న ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్


తొలి ఏడాది విజయోత్సవాలు



సుపరిపాలనలో తొలి అడుగులో మంత్రి అనితతో ఎంఎల్‌ఎ రోషన్



ఎంపీతో పుట్టా మహేష్‌తో కలిసి చింతలపూడి ఏరియా హాస్పటల్‌లో పరికరాల ప్రారంభోత్సవం


అమెరికాలో ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కు సత్కారం


పెట్టుబడుల కోసం సిఎం చంద్రబాబుతో కలిసి రోషన్ ప్రయత్నం


జంగారెడ్డిగూడెం మండలంలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం



జంగారెడ్డిగూడెం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో..


కామవరపుకోట మండలం రావికంపాడు పంచాయతీ వెంకటాపురం గ్రామంలో స్పౌజ్ పెన్షన్ల పంపిణీ


తొలి ఏడాది అడుగులు..


ఎర్రగుంటపల్లి - కొల్లివారిగూడెం రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్


రేషన్ సరుకులు పంపిణీ చేస్తూ..


మొక్కలు నాటుతూ..


చింతలపూడిలో విద్యార్థి మిత్ర కిట్ అందిస్తూ..


లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో ట్రై సైకిళ్ల పంపిణీ


వివిఎస్‌ఎస్‌లకు చెక్కు అందిస్తూ..


మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందిస్తున్న మంత్రి పార్థసారథి, ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్


సంక్రాంతి సంబరాల్లో ఎంఎల్‌ఎ దంపతులు


చింతలపూడిలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎంఎల్‌ఎ


కామవరపుకోట మండలం నలగొపవారిగూడెంలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ, నేతలు

ప్రసిద్ధ క్షేత్రం.. మద్ది ఆంజనేయ స్వామి ఆలయం


మద్ది ఆంజనేయ స్వామి ఆలయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో మద్ది ఆంజనేయ స్వామి ఆలయం నిత్యం యాత్రికులతో కిటకిటలాడుతుంటుంది. ఆలయంలో నిత్య అన్నదానంతో యాత్రికులకు ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభులై ఉన్న శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారి చరిత్ర ఈ విధంగా ఉంది. ఉపాసనాపరులు, వయోవృద్ధులు, చరిత్రకారులు చెప్పిన విషయాలను శాస్త్ర ప్రమాణం చేస్తే మద్ది చెట్టుకు, ఆంజనేయస్వామికి ఉన్న సంబంధం తెలుస్తుంది. గర్గ సంహిత పద్మ పురాణం శ్రీ రామాయణంలో చెప్పిన ప్రకారం చరిత్ర ఉంది. త్రేతాయుగములో మద్వాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడు. రావణ సైన్యంలో ఉన్న మద్వాసురుడు అసుర ప్రవృత్తితో కాకుండా ఆధ్యాత్మిక చింతనతో జీవిస్తుండేవాడు. కాలక్రమేణ రామ, రావణ యుద్ధం వచ్చింది. యుద్ధంలో రాముడి వైపు పోరాడుతున్న ఆంజనేయస్వామి వారిని చూసి మనసు చలించి అస్త్ర సన్యాసం చేసి హనుమా అంటూ తనువు చాలించాడు. ద్వాపరాయుగంలో మద్యకుడుగా జన్మించి సదాచార సంపన్నుడై నిత్యం భక్తి భావనతో ఉండేవాడు. విధివశాత్తు వచ్చిన కౌరవ, పాండవుల యుద్ధంలో కౌరవ పక్షాన పోరాడుతున్న మద్యకుడు అర్జునుని జెండాపై ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారిని చూసి పూర్వజన్మ స్మృతితో ప్రాణత్యాగం చేశాడు. కలియుగంలో మద్యుడుగా జన్మించి తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. అలా తిరిగి తిరిగి ఎర్ర కాలువ ఒడ్డుకు వచ్చి తపస్సు చేసుకునేందుకు నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. ప్రతి దినం కాలువలోకి దిగి స్నానం ఆచరించి శ్రీ ఆంజనేయ స్వామి వారి కోసం తపం ఆచరించేవాడు. ఒకరోజు మహర్షి స్నానం ఆచరించి ఒడ్డుకు వస్తుండగా కాలువలో పడిపోతుండగా ఎవరో ఆపినట్లుగా ఆగిపోయాడు. ఒక వానరం మహర్షి చెయ్యి పట్టుకుని ఒడ్డుకు తీసుకొచ్చి సపర్యాలు చేసి ఒక ఫలం ఆహారంగా ఇచ్చిన ఆ వానరం గురించి మహర్షి ఆలోచించలేదు. ఇలా కొంతకాలం మీతో సపర్యలు చేయించుకున్నానా... ఎంతటి దౌర్భాగ్యుడను.. సాక్షాత్తు స్వామివారిచే సపర్యలు చేయించుకున్న పాపాత్ముడను నేను జీవించి ఉండడం అనవసరమని విలపిస్తుండగా స్వామి ప్రత్యక్షమై మద్వా! ఇందులో నీ తప్పు విసమైనా లేదు. నీ స్వామి భక్తికి నేను మెచ్చి స్వయంగా వచ్చి నీకు సేవలు చేశాను. విచారించక ఒక వరం కోరుకోమని చెప్పాడు. దానికి మీరు ఎల్లప్పుడూ నా చెంత ఉండేలా వరం ప్రసాదించమని ప్రార్థించాడు. అప్పుడు ఆ స్వామి నీవు మద్ది చెట్టుగా అవతరించు, నేను నీ సమీపంలో శిల రూపంలో ఎక్కడా లేని విధంగా ఒక చేతిలో ఫలం మరి ఒక చేతిలో గదతో వెలుస్తాను. నీ పేరున శ్రీ మధ్య ఆంజనేయ స్వామిగా భక్తులకు దర్శనం ఇస్తానని తెలిపాడు. ప్రస్తుతం ఆలయం ఎంతో అభివృద్ధి చెందింది. ఆంధ్రప్రదేశ్‌లో ఒక పర్యాటక ప్రాంతంగా మారింది. నిత్య అన్నదానంతో యాత్రికులకు ఎప్పుడూ ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. ఈ ఆలయం నిత్యం యాత్రికులతో కిటకిటలాడుతుంటుంది.

నిత్యం యాత్రికులతో ఆలయం కిటకిట



వెంకన్న సన్నిధి.. పారిజాత గిరి..


గోకుల తిరుమల పారిజాత గిరి క్షేత్రం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గోకుల తిరుమల పారిజాత గిరి క్షేత్రానికి యాత్రికుల అధిక సంఖ్యలో వస్తుంటారు. చరిత్ర విషయానికొస్తే పూర్వం చిట్టియ్య అనే భక్తునికి శ్రీవెంకటేశ్వరస్వామి కలలో కనిపించి జంగారెడ్డిగూడెం గ్రామానికి ఉత్తరం వైపు కొండల్లో తన పాదాలు వెలుస్తాయని, ఆ ప్రదేశంలో ఆలయం నిర్మించాలని, భక్తుల అభిషములు నెరవేరుస్తానని తెలిపినట్లు చెబుతారు. ఆ ప్రకారం చిట్టియ్య అన్వేషించగా జంగారెడ్డిగూడెం ఉత్తర వైపున వరుసగా ఉన్న ఏడు కొండల్లో ఆరో కొండపై పారిజాత వృక్షం కింద స్వామివారి పాదాలు కలశిల గుర్తించినట్లు చరిత్ర చెబుతోంది. ఆ ప్రదేశంలో చిన్న మందిరం నిర్మించగా భక్తుల కోర్కెలను నెరవేర్చే స్వామిగా అనతికాలంలోనే ప్రసిద్ధి పొందారు. 2002లో శ్రీ పెరిచెర్ల జగపతిరాజు ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ ఏర్పడి భక్తుల సహకారంతో ఆలయం నిర్మించారు. శ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీ వైఖానస ఆగమయుక్తంగా స్వామివారి పాదాలు వెలిసిన ప్రదేశంలో శ్రీ స్వామివారి ధృవమూర్తిని ప్రతిష్టించారు. గోకుల తిరుమల పారిజాత గిరి క్షేత్రంగా ప్రసిద్ధి పొందింది.





ఈ విద్యాలయం.. విద్యార్థుల ఉన్నతికి సోపానం


స్కూల్ క్రీడా మైదానం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణంలో విద్యా వెలుగులు పంచే మహత్తర ఆరంభం 1949వ సంవత్సరంలో జరిగింది. అదే సంవత్సరంలో జంగారెడ్డిగూడెం బాలుర ప్రభుత్వ హైస్కూల్ స్థాపించబడింది. ఈ పాఠశాలకు స్థలాన్ని అందజేయడంలో అగ్రగణ్యుడైన మండవల్లి సోమయ్య అపూర్వ దాతృత్వాన్ని చాటారు. ఆయన సుమారు 7 ఎకరాల భూమిని స్కూల్ కోసం విరాళంగా ఇచ్చి విద్యారంగ అభివృద్ధికి ఎనలేని సేవలందించారు. ఈ పాఠశాలలో మొదటి ప్రధానోపాధ్యాయులుగా సూర్యనారాయణ 1949-51 వరకూ బాధ్యతలు చేపట్టి విద్యార్థులకు నైతికత, నాణ్యత, క్రమశిక్షణ ప్రధానమైన విద్యను అందించారు. అప్పటి నుంచి నేటి వరకు ఈ పాఠశాల అనేక ప్రధానోపాధ్యాయుల పాలనలో అభివృద్ధి చెందుతూ వేలాది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దింది. ఈ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారు. వారు ఈ పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందజేస్తున్నారని ప్రస్తుతం ఉన్న ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. తమ స్కూల్‌లో విశాలమైన ఆట స్థలం, పాఠశాలలో ప్రోగ్రామ్‌లు చేసుకోవడానికి స్టేజి, విశాలమైన పాఠశాల గదులు, మంచి గురువులచే విద్యాబోధన అందిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాల ఒక విద్యాలయమే కాకుండా జంగారెడ్డిగూడెం ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది.





